# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం



రిపోర్టర్లు కావలెను

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459



సంపుటి: 01 | సంచిక: 303 | హైదరాబాద్ | శనివారం | 19-04-2025 | పేజీలు: 08


## పిచ్చిమాటల మాట్లాడితే ఊరుకోం..

**అంజన్ కుమార్‌పై ఈటల ఫైర్**

**గుణపాఠం తప్పదని హెచ్చరిక**



2

## ఇంటర్ పేపర్ లీకేజీ నుండి.. గ్రూప్1 పేపర్ లీకేజీలే బీఆర్ఎస్ పాలన

ఏడాదిలో 56 వేల ఉద్యోగాలతో

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ఉదాహరణ

బీఆర్ఎస్ హయంలో పేపర్ లీకుల పరంపర

కవిత అబద్ధ ప్రచారాలు చేస్తోంది: బల్మూరి వెంకట్



2

## రజతోత్సవ సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

**నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం**



2

# పెట్టుబడిల వెల్లువ

హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్

ఎన్‌టీటీ డేటా, నెయిసా సంయుక్తంగా రూ. 10,500 కోట్ల పెట్టుబడులు

తెలంగాణ ప్రభుత్వంతో ఈ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు త్రైపాక్షిక ఒప్పందం



**హైదరాబాద్ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టీటీ డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి దాదాపు రూ. 10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు త్రైపాక్షిక ఒప్పందం (ఎమ్ఓయూ) కుదుర్చుకున్నాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బజ్‌పాయ్,

...మిగతా 2లో



## భూభారతితో సమస్యలకు చెక్

ధరణితో ఇష్టారీతిన భూ బదలాయింపులు

పైసా ఖర్చు లేకుండా భూభారతిలో ఫిర్యాదులు

తహసిల్దార్ పరిధిలో సమస్యలు పరిష్కారం

ఉమ్మడి జిల్లాకు ఒక సిసిఎల్ఏ, ట్రిబ్యునల్ ఏర్పాటు

వెంకటాపూర్‌లో భూభారతి అవగాహన సదస్సులో పొంగులేటి

**ములుగు,ఏప్రిల్18 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం సామాన్య రైతులకు న్యాయం జరిగేవిధంగా ఉంటుందని, రైతుల కళ్లలో ఆనందం చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్షమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూ భారతి కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూ భారతి రెవన్యూ సదస్సుకు మంత్రులు

...మిగతా 2లో

## మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్, బీఆర్ఎస్

**మూడు పార్టీలది తెలంగాణను ముంచే ఎజెండా**

**ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో కిషన్ రెడ్డి**



2

## నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

**గ్రూప్-1 నోటిఫికేషన్‌ను వెంటనే రద్దుచేయాలి**

**పరీక్షల నిర్వహణపై అనుమానాలు ఉన్నాయి**

**సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ**

2



## న్యాయవ్యవస్థపై దన్‌ఖడ్ వ్యాఖ్యల దుమారం

విపక్షాలు ఆక్షేపణ, తిప్పికొట్టిన బీజేపీ



2

# పెట్టుబడిల వెల్లువ

మొదటిపేజి తరువాయి



నెయిసా సీఈవో, ఎన్టీటీ గ్లోబల్ డేటా ఛైర్మన్ శరద్ సంఘీ ఈ ఒప్పందంలో పాల్గొన్నారు.

దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం హైదరాబాద్‌లో నిర్మించబోయే ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్. 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది. దేశంలో తెలంగాణను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. ఎన్‌టీటీ డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐఫస్ట్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ కొత్త ఆవిష్కరణల కేంద్రంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వమిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది.

ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీ ఆర్‌ఎల్‌ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్ గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని అన్నారు.

టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లో పేరొందిన కంపెనీ. 50 కంటే ఎక్కువ దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తుంది. నెయిసా నెట్ వర్క్ ఏఐ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ, నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్‌ను అందించటంపై ఈ కంపెనీ దృష్టి సారిస్తుంది..

# మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్, బీఆర్ఎస్

- **మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్, బీఆర్ఎస్**
- **మూడు పార్టీలది తెలంగాణను ముంచే ఎజెండా**
- **ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

ప్రజలను దోపిడీ చేసి.. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడి.. ప్రజల రక్తం తాగిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జీ హుజూరంటున్నాయని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై కిషన్ రెడ్డి విర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి తెలంగాణను ముంచే ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాక సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. పార్టీ నాయకులు, శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కేసీఆర్‌లకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రజాకార్ల వారసత్వాన్ని పొందిన మజ్లిస్ పార్టీకి వ్యతిరేకంగా జాతీయ వాద భావనతో బీజేపీ పోటీ చేస్తోందని వివరించారు. మజ్లిస్ పార్టీ,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారుల వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తు చేశారు. మజ్లిస్ పాత బస్తీకే మాత్రమే పరిమితం కాలేదని.. ఆ పార్టీ ప్రస్తుతం తెలంగాణలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాప కింద నీరులా విస్తరిస్తోందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడిరచాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒకే తానుముక్కలుగా కలిసి పని చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చైతన్యంగా ఆలోచించక పోతే,మళ్లీ రజాకార్ల పాలన లాంటి పరిస్థితులు దాపురించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు.. పాత బస్తీలోని హిందువుల ఇళ్లను స్వాధీనం చేసుకుని ప్రజలను ఖాళీ చేయించిన ఘటనలు చాలానే ఉన్నాయన్నారు. తెలంగాణను, హైదరాబాద్‌ను బలి చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వెనుకాడడం లేదన్నారు. ప్రజలను జాగృతం చేయాలనే పవిత్ర ఉద్దేశంతోనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తోందని చెప్పారు. మాకు గెలుపు ఒక్కటే ముఖ్యం కాదని.. హైదరాబాద్‌ను రక్షించడం కూడా ప్రధాన లక్ష్యమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మజ్లిస్ పార్టీ మతోన్మాదం, గూండాయిజాన్ని ఎదుర్కొంటూ బీజేపీ ధర్మయుద్ధం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైటెక్ సిటీలో రంగులు వేసి అభివృద్ధి అంటూ ప్రచారం చేశారు. కానీ అభివృద్ధి పేరు చెప్పి ఎక్కడైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువ ఉందో అక్కడే పనులు జరిగాయని ఆరోపించారు. ఇరుకైన రోడ్లు సైతం నిర్మించారన్నారు. జీహెచ్ఎంసీ స్థితి దారుణంగా మారిందని.. వీధిలైట్లు కొనడానికి డబ్బులేని స్థితికి దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరు అసమర్థంగా ఉందని.. పౌర సేవల మెరుగుదలకు నిధులు సైతం పెరగడం లేదన్నారు. మజ్లిస్ పార్టీ నుంచి నగరాన్ని రక్షించాలంటే.. చైతన్యంతో ఓటు వేయాలని ప్రజలకు ఆయన సూచించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు విదేశీ పెట్టుబడుల గురించి చెబుతున్నారు..కానీ అవి ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక, పన్నుల సంస్కరణలు ఉగ్రవాదం, మతోన్మాదాన్ని అరికట్టడంతోపాటు సమర్థవంతమైన విదేశాంగ విధానం.. ఇలా అన్నింటిలో ప్రగతి కనిపిస్తోందని చెప్పారు. గతంలో విద్యుత్ కోసం రైతులు మోటార్ల దగ్గర నిద్రించాల్సి వచ్చేదని..మోదీ పాలనలో విద్యుత్



కోతల్లేని దేశంగా మారిందన్నారు. సనత్ నగర్,మల్కాజ్ గిరి,దిల్‌సుఖ్‌నగర్, గౌలిపుర,చార్మినార్,నాంపల్లి, సోమాజిగూడ, ఖైరతాబాద్,కూకట్ పల్లి తదితర ప్రాంతాల్లో ప్రజల సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గౌతం రావు గారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త ఐకమత్యంగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మజ్లిస్ పార్టీ ఇప్పుడేం ఓల్డ్ సిటీకి మాత్రమే పరిమితం కాలేదని, తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తూ కుట్రలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు.

# భూభారతితో సమస్యలకు చెక్

మొదటిపేజి తరువాయి

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.భూ భారతి రెవెన్యూ సదస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నముక రైతు అని, రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైధరణి పోర్టల్ తీసుకువచ్చి గులాబీ నాయకులు ఇష్టా రీతిని వారి పేర్లపై వందల ఎకరాలు పట్టాలు చేయించుకుని, చట్టాన్ని చుట్టంగా మలుచుకుని రైతు బంధు పొందారు తప్పా సామన్య పేదరైతుకు న్యాయం జరిగిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడగానే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపి సామాన్య రైతుకు శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా భూ భారతి చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చిన మేరకు భూ భారతి చట్టం తీసుకువచ్చామని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సాదా బైనామాద్వారా రైతులు పెట్టుకున్న దరఖాస్తులు రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల 24 వేలు ఆన్‌లైన్ లో ఉన్నాయని, అన్నింటికీ భూ భారతిలో అవకాశం కల్పించి రైతులకు న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తామన్నారు. పేదల ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా భూ భారతి చట్టం రూపొందించి, చట్టం చేసిన 90 రోజుల్లోనే విధి, విధానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూ భారతి పోర్టల్‌లో రైతు సమస్యలపై దరఖాస్తు చేస్తే ముందుగా తహశీల్దార్ పరిధిలో ఉంటుందని, తహశీల్దార్ చేయకపోతే ఆర్డిఓ, అదనపు కలెక్టర్ సరిచేయాలని, కలెక్టర్ చొరవ తీసుకుని పరిష్కారం చూపాలని అన్నారు. ఉమ్మడి జిల్లాకు ఒక సిసిఎల్ఏ, ట్రిబ్యునల్ ఏర్పాటు చేయనున్నట్లు అందులో సమస్యలకు పరిష్కారం అయ్యే విధంగా ఉంటుందని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే హైదరాబాద్‌లోని రెవెన్యూ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అధికారులు నిబద్ధతలో పనిచేయాలని, గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి స్వయంగా కలెక్టర్లు వెళ్లి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గత బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు చెప్పిన మాట వినలేదని విఆర్వో, విఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి, 23 వేల మంది ఉద్యోగులను రోడ్డు పాలు చేసారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఒక అధికారి ఉండాలనే ఉద్దేశంతో తిరిగి గ్రామపాలనాధికారుల వ్యవస్థ తీసుకురావడం జరిగిందన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలు పరిష్కంచేందుకు కృషిచేస్తారన్నారు. ధరణి చట్టం చేసిన తర్వాత రెవెన్యూ సదస్సులు ఎందుకు పెట్టలేదని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. సదస్సులు పెడితే ధరణి బాధితులు మీ వీపులు పగలకొట్టేవారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి పొంగులేటి వ్యాఖ్యానించారు. నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సాగు చేసుకుంటున్న రైతుల పేర్లకు బదులు, పింక్ షర్ట్ వేసుకున్న వాళ్లకు పట్టా పాసు పుస్తకాలు ఇచ్చింది గత కేసీఆర్ సర్కార్ అని ఆయన ఆరోపించారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రైతులు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలకు అక్కడున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు. ధరణి పార్ట్ బీలో 18 లక్షల ఎకరాల భూములు ఉన్నాయని, పేదల ఆరున్నర లక్షల ఎకరాల భూమి అందులోనే ఉందని చెప్పారు. ఆ పేదల భూ సమస్యకు భూభారతి పరిష్కారం చూపుతుందని ఆయన హామీ ఇచ్చారు. భూముల మ్యాప్‌లు ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని, భూముల కొలతలకు, 6 వేల మంది సర్వేయర్లను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. భూభారతి చట్టానికి విధివిధానాలు ఖరారు చేశామని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజల అభిప్రాయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కళ్లముందుంచుకుని పనిచేస్తుందని స్పష్టం చేశారు. పేదలకు నిత్యం తోడుగా నిలబడే సంకల్పంతోనే ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని ఆమె తెలిపారు. పేదింటి బిడ్డలకు సన్నబియ్యం అందిస్తే.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు అసహనంతో రెచ్చిపోతున్నారని ఆమె మండిపడ్డారు. పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చూసి వారు ఓర్చలేకపోతున్నారని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలపై అన్యాయం చేసిందని, ముఖ్యంగా భూ వ్యవహారాల్లో పేదలపై వివక్ష చూపిందని ఆమె ఆరోపించారు. భూములపై జరిగే అక్రమాలను అరికట్టేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని, గతంలో 'ధరణి' పేరిట ప్రజలను మోసం చేశారని ఆమె వ్యాఖ్యానించారు. మేము తెచ్చిన కొత్త చట్టం ద్వారా భూములు అర్హులైన వారికే చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇది ఒక మంచి లక్ష్యంతో రూపొందించిన చట్టం అని సీతక్క వివరించారు. ఇల్లు లేని వారికి గృహ నిర్మాణం కల్పించాలన్నదే ప్రభుత్వం ముందున్న ముఖ్యమైన లక్ష్యమని, ప్రతి పేద కుటుంబం కుండపోత వర్షాల్లోనూ సురక్షితంగా ఉండేలా ఒక గుడిసె అయినా ఉండాలని అనుకుంటున్నామని మంత్రి సీతక్క తెలిపారు. గత ప్రభుత్వంలో వీఆర్వోలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, చివరికి వారినే నిందించారని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు కొత్త చట్టం అమలులో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు. రెవెన్యూ అధికారులు, రైతులకు భూ భారతి అమలు తీరు, విడి విధానాలపై అవగాహన కల్పించారు.

# నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

- **గ్రూప్-1 నోటిఫికేషన్‌ను వెంటనే రద్దుచేయాలి**
- **పరీక్షల నిర్వహణపై అనుమానాలు ఉన్నాయి**
- **సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ**

**హైదరాబాద్ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో గ్రూప్ 1 పరీక్షను నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. వెంటనే గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను రద్దుచేసి పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో వేలాది మంది నిరుద్యోగుల జీవితాలు అగాధంలోకి నెట్టివేశారని అన్నారు.ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీ లోపించిందని విమర్శించారు. యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడడం సరికాదని తెలిపారు. గ్రూప్ 1 పరీక్ష నిర్వహించిన తీరు, ఫలితాల వెల్లడిపై అభ్యర్థుల్లో అనేక సందేహాలున్నాయని.. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్ నెంబర్ల కేటాయింపుతో గందరగోళం నెలకొందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనంపైనా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొంటూ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళన ధర్మబద్ధమని హైకోర్టు కూడా గుర్తించి నియామకాల ప్రక్రియకు బ్రేకులు వేసిందని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యమనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. తెలంగాణ యువతకు, మరీ ముఖ్యంగా నిరుద్యోగులకు అనేక ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన మీరు వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. మెయిన్స్ పరీక్షలకు హాజరైన రెండు కోచింగ్ సెంటర్లకు చెందిన 71 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించడం వెనుక ఏదో జరిగి ఉందని అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఆ విషయాన్ని టీజీపీఎస్సీ కూడా అంగీకరించిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో గ్రూప్ 1 నోటిఫికేషన్ ను పూర్తిగా రద్దు చేసి తిరిగి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

# పిచ్చిమాటల మాట్లాడితే ఊరుకోం.

- **అంజన్ కుమార్‌పై ఈటల ఫైర్**
- **గుణపాఠం తప్పదని హెచ్చరిక**

**హైదరాబాద్ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల.. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి నోటికొచ్చినట్లుగా మాట్లాడటం సరికాదని అన్నారు. చేతకానివారే ఏది పడితే అది మాట్లాడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషల్ హెరాల్డ్ కేసు ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిందేమి కాదని.. చట్టాన్ని గౌరవించకుండా హస్త పార్టీ నేతలు ఆందోళనలు చేయడం సిగ్గుచేటని హితవు పలికారు. కాంగ్రెస్ నేతలు సంస్కారహీనంగా మాట్లాడారని.. పిచ్చి మాటలు మాట్లాడే నేతలకు గుణపాఠం తప్పదని ఈటల రాజేందర్ వార్నింగ్ ఇచ్చారు. అయితే.. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఈడీ ఛార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ.. గురువారం టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్



ఈడీ కార్యాలయ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. ఆ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసభ్య పదజాలంతో దూషించారు. ఈ క్రమంలోనే అంజన్ కుమార్ యాదవ్ పై ఈటల రాజేందర్ ఫైర్ అయ్యారు.

# ఇంటర్ పేపర్ లీకేజీ నుండి.. గ్రూప్1 పేపర్ లీకేజీలే బీఆర్ఎస్ పాలన

**హైదరాబాద్ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తక్కువ కాలంలోనే నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామని, గతంలో బీఆర్ఎస్ చేయని పనులు ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం ఒకే ఏడాదిలో 56 వేల ఉద్యోగాలను భర్తీ చేయడమే దీన్ని ధ్రువీకరిస్తుందని తెలిపారు.

ఇంటర్ పరీక్షల పేపర్ లీక్ నుంచి గ్రూప్ 1 పరీక్షల లీక్ వరకు జరిగిన అనేక ఘటనలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని వెంకట్ ఆరోపించారు. మీ హయంలో పేపర్ లీక్ జరిగితే స్పందించావా కనీసం? అని ఎమ్మెల్సీ కవితను నిలదీశారు బల్మూరి వెంకట్. పరీక్షా కేంద్రాల ఎంపికను TGPSC కాదు, కలెక్టర్లు నిర్ణయిస్తారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేంద్రాలు పెంచుకుంటారు. కనీస అవగాహన లేకుండా మాట్లాడకూడదు అని వ్యాఖ్యానించారు.

మాస్ కాపీయింగ్ జరిగిందని మాట్లాడడానికి సిగ్గుండాలని, వుమెన్ సెంటర్‌లో జరిగిందంటారు, అయితే మిగతా అభ్యర్థుల పరిస్థితి ఏంటి? ఆధారాలు ఉంటే బయట పెట్టండి. లేకపోతే అర్థం లేకుండా మాట్లాడొద్దు అని హితవు పలికారు. కవిత



అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఎద్దేవా చేసిన బల్మూరి వెంకట్, మీకు, కేటీఆర్‌కి మధ్య పోటీ జరుగుతోంది.. నువ్వు నాలుగు అబద్ధాలు ఆడితే, ఆయన ఆరింటి వరకూ వెళ్తున్నారు. ఇది నిజమైన చిత్తశుద్ధి కాదు అని వెంకట్ పేర్కొన్నారు.

లిక్కర్ స్కాంలో ఇప్పటికే పరువు పోయిందని, ఇప్పుడు అబద్ధాలు చెప్పి మళ్లీ పరువు తీసుకోకు అంటూ ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలు రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుందని, కాబట్టి జాగ్రత్తగా ఉండి నిజాలే మాట్లాడాలి అని బల్మూరి వెంకట్ వ్యాఖ్యానించారు.

## రజతోత్సవ సభలో మహిళల కోసం
# ప్రత్యేక ఏర్పాట్లు

**నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం**

**హైదరాబాద్ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ మహిళా నేతలతో పాటు పలువురు నాయకులతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు చేస్తూ కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్ పర్సన్ రజినీ సాయిచంద్, నవీన్ ఆచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థపై దన్‌ఖడ్ వ్యాఖ్యల దుమారం

**విపక్షాలు ఆక్షేపణ, తిప్పికొట్టిన బీజేపీ**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** న్యాయవ్యవస్థ, దాని ప్రొసీడింగ్స్‌పై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది. రాష్ట్రపతిని ఆదేశించే విధంగా న్యాయవ్యవస్థ వ్యవహరించడాన్ని ధన్‌ఖడ్ తప్పుపట్టారు. జడ్జీలే సూపర్ పార్లమెంటును నడిపిస్తున్నట్టుందని వ్యాఖ్యానించారు. దీనిపై ప్రధాన విపక్ష పార్టీలు మండిపడగా, ఉపరాష్ట్రపతికి సమర్థనగా బీజేపీ స్పందించింది.

**ఇందిరాగాంధీ ఉదంతం గుర్తులేదా?**

జగదీప్ ధన్‌ఖడ్‌కు సిబల్ కౌంటర్ న్యాయవ్యవస్థపై ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలను కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే తదితప పార్టీలు తప్పుపట్టాయి. న్యాయవ్యవస్థను బలహీనపరిచేలా ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించడం ఆయన ధిక్కార వైఖరిని చాటుతోందని విపక్ష పార్టీలు విమర్శించాయి. ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగం సుప్రీం అని, రాష్ట్రపతి అయినా ప్రధాని, గవర్నర్లు అయినా దానికి అతీతులు కారని కాంగ్రెస్ సీనియర్ నేత రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా అన్నారు. పెండింగ్ బిల్లులపై గడువులోగా రాష్ట్రపతి, గవర్నర్లు నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు సరైన సమయంలో సాహసోపేతమైన తీర్పు ఇచ్చిందని అన్నారు.

టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ సైతం ఇదేతరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థపై గౌరవం లేకుండా ఉపరాష్ట్రపతి మాట్లాడుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు జడ్జిలపై ఉపరాష్ట్రపతి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, కోర్టు ధిక్కారానికి పాల్పడటమేనని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇతర రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడాల్సి ఉంటుందన్నారు. న్యాయవ్యవస్థపై ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు అనైతకమని డీఎంకే నేత తిరుచ్చి శివ అన్నారు. సంపూర్ణ న్యాయం కోసం సుప్రీంకోర్టుకు రాజ్యాంగం అధికారం ఇచ్చిందని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ అన్నారు. ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు దిగ్భ్రాంతికరమని వ్యాఖ్యానించారు.



**బీజేపీ స్పందన**

కాగా, ఉపరాష్ట్రపతి అభిప్రాయానికి సమర్థనగా బీజేపీ ప్రతినిధి షహజాద్ పూనావాలా స్పందించారు. విపక్ష పార్టీల హిపోక్రసీని తప్పుపట్టారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని అమలు చేయమని చెప్పిన వాళ్లు, ఉపరాష్ట్రపతిని హేళన చేసిన వారు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అల్లర్లకు పాల్పడేవాళ్లని కాపాడేవారు, బెంగాల్‌లో హిందూ బాధితులను పరామర్శించేందుకు కూడా తీరిక లేని వాళ్లు రాజ్యాంగ ఔన్నత్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. ఇలాంటి వాళ్ల నుంచి తాము పాఠాలు నేర్చుకునేందుకు సిద్ధంగా లేమన్నారు.

**జగదీప్ ధన్‌ఖడ్ ఏమన్నారంటే?**

రాష్ట్రపతిని ఆదేశించే విధంగా న్యాయ వ్యవస్థ వ్యహరించడాన్ని జగ్‌దీప్ ధన్‌ఖడ్ వ్యతిరేకంచారు. రాజ్యాంగంలోని 142వ అధికరణ ద్వారా సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు వర్తిస్తాయని, అయితే ఆ అధికరణ ప్రజాస్వామ్య వ్యవస్థలపై న్యూక్లియర్ మిజైల్స్ తరహాలో వాడుతున్నారని ఆరోపించారు. డెడ్‌లైన్ ప్రకారం పనిచేయాలని రాష్ట్రపతిని ఆదేశించడం సరికాదన్నారు. జడ్జీలే శాసనసభ వ్యవహారాలు చూస్తున్నట్టు, ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు అమలు చేస్తున్నట్టు, సూపర్ పార్లమెంటును నిడిపిస్తున్నట్టు ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 145(3) ప్రకారం మాత్రమే రాజ్యాంగాన్ని ప్రశ్నించే హక్కు ఉంటుందని, ఇందుకు ఐదు, అంతకుమించి ఎక్కువ మంది జడ్జీలతో ధర్మాసనం ఏర్పాటు చేయాలని అన్నారు.

# నేడు విద్యుత్ కు అంతరాయం

**సుల్తానాబాద్,ఏప్రిల్ 18,(ప్రజాక్షేత్రం):**

నేడు విద్యుత్ కు కొంత అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని సుల్తానాబాద్ విద్యుత్ ఏఈ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు సుల్తానాబాద్ మరియు నారాయణపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ కు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.





# సురభి శ్రీధర్ కు మానవత్వ సేవా పురస్కారం

**గోదావరిఖని,పెద్దపల్లి,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** వెలుగు సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు గురువారం ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ ఆడిటోరియంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న సామాజిక సేవకులకు రాష్ట్రస్థాయి అవార్డుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు.ఈ అవార్డుల కార్యక్రమంలో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ కు 2025 గాను మానవత్వ పురస్కారాన్ని ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ కోడెల మంజుల,కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్,గౌరవ సలహాదారుడు డాక్టర్, గూడూరు చేన్నారెడ్డి,స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో కోశాధికారి డాక్టర్ కుమారస్వామి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది.అనంతరం డా.సురభి శ్రీధర్ మాట్లాడుతూ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరి సహకారంతోనే ఈ పురస్కారం అందుకోవడం జరిగిందని తెలిపారు.ఈ పురస్కారం రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సంస్థకు సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలుపుకుంటున్నామని తెలిపారు.డా.సురభి శ్రీధర్ కు పురస్కారం రావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధి కూలీలకు ట్రావేలింగ్ చార్జీలు ఇవ్వాలి.

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డిమాండ్.
- నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి పనిచేసిన గిట్టుబాటు గాని కూలి.



**మంథని,పెద్దపల్లి,ఏప్రిల్18(ప్రజాక్షేత్రం):** మంథని మండలం మైదుపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి అడవి ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు ఎర్రటి ఎండలో నాలుగు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి అడవి ప్రాంతంలో ఉపాధి పనులు చేస్తున్నారని వీరికి ట్రావెలింగ్ చార్జీలు ఇవ్వటం లేదని విమర్శించారు.ఇంత దూరం వచ్చి పనిచేసిన కూలి గిట్టుబాటు కావడం లేదని అన్నారు.పనిముట్లైన పార గడ్డపార తట్టలు కూలీలే కొనుకుంటున్నారని ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని విమర్శించారు.నాలుగు కిలోమీటర్లు పోయి వచ్చే క్రమంలో ప్రమాదాలు జరుగుచున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేవని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఉపాధి కూలీలకు ట్రావెలింగ్ చార్జీలు ఇచ్చి రెండు నెలల కూలీల డబ్బులు విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల నాలుగు నెలల వేతనాలు ఇవ్వాలని పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తూండ్ల కనకయ్య,తమ్మిశెట్టి మల్లయ్య,ఇసంపల్లి శ్రీనివాస్,పంతంగి లక్ష్మి,పెట్టం పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబు.

**మంథని,పెద్దపల్లి,ఏప్రిల్18(ప్రజాక్షేత్రం):** మంథని నియోజకవర్గం రామగిరి మండలం లద్నపూర్ గ్రామానికి చెందిన దాసరి ఓదెలు అనారోగ్యంతో నిమ్స్ లో చికిత్స పొందుతూ ఆర్థిక సహాయం కోసం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు తెలుపగా వెంటనే స్పందించిన శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఒక లక్ష 30 వేల రూపాయల ఎల్వోసి మంజూరు చేయించారు. శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబు ఆసుపత్రి సహాయకులు ఓదెలు కుటుంబ సభ్యులకు హైదరాబాదు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏల్వోసి అందజేశారు.ఒక లక్ష 30 వేల ఎల్ఓసి మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకు ఓదెలు తో పాటు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# మానవాళి చేసిన పాపాలకు యేసు ప్రభు తన ప్రాణాలను శిలువపై ఉంచిన డే గుడ్ ఫ్రైడే.

**టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి.**

**కొండాపూర్,ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం):** మానవాళి చేసిన పాపాలకు యేసు ప్రభు తన ప్రాణాలను శిలువపై ఉంచిన డే గుడ్ ఫ్రైడేఆరాధనల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి అన్నారు.శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా కొండాపూర్ మండల పరిధిలోని గంగారం సిల్వగుట్ట పై నిర్వహించిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో టీజీ ఐ ఐ సి చైర్మన్ క్రిస్టియన్ లతో కలిసి నిర్మలారెడ్డి పాల్గొని ప్రత్యేక ఆరాధన చేసి లోక రక్షకుడు సందేశాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుభ శుక్రవారంకు ఒక ప్రత్యేకత ఉందని, యేసు ప్రభు శిలువ పై తన ప్రాణాలను పణంగా పెట్టారన్నారు.ప్రేమ ఆప్యాయతలను అందరికీ పంచాలని సమాజానికి హితబోధ చేసిన జీసస్ మానవాళికి అందజేసిన సందేశమన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటి చైర్మెన్ వై.ప్రభు,కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, నర్సింలు,రవి,కిషన్ నాయక్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.






# గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం.

- వడ్ల కొనుగోలులో పకడ్బంది చర్యలు.
- రైతులను మోసం చేసిన ప్రభుత్వం బి.ఆర్.ఎస్ మాత్రమే.
- ప్రజా ప్రభుత్వంలో చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాం.
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్.

**రామగుండం,పెద్దపల్లి,ఏప్రిల్18(ప్రజాక్షేత్రం):** రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని బసంత్ నగర్,పాలకుర్తి,గుంటూరుపల్లి,ఎల్కలపల్లి,కొత్తపల్లి,రామారావుపల్లి,తక్కలపల్లి,పుట్నూర్,గుడిపల్లి,జయారం,కుక్కలగూడూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పిస్తూ,దళారులు లేకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని,ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర లభించడంతో పాటు సకాలంలో చెల్లింపులు చేయబడతాయని ఎమ్మెల్యే వివరించారు.రైతులు ఎటువంటి మధ్యవర్తులు,దళారులు లేకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని విక్రయించవచ్చని సూచించారు.ప్రతి రైతుకు పూర్తి సమాచారం అందించేందుకు స్థానిక అధికారులు,గ్రామ వాలంటీర్లు సమన్వయంగా పనిచేస్తున్నారని తెలిపారు. నేను ఎమ్మెల్యే అయినా తరువాత మూడు సీజన్లు గింజ కటింగ్ లేకుండా రైతుల ధాన్యం కొనడం జరిగిందని ఈ నాలుగో పంటకు కూడా గింజ కటింగ్ ఉండదని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10సంవత్సరాలు రైతులు వారి ధాన్యము నుంచి క్వింటాలకు 10నుంచి 15 కిలోల వరకు కొతబెట్టి రైతన్నను ఇబ్బందికి గురి చేశారని అన్నారు.ఈ నియోజకవర్గంలో యేసంగి లో కూడా మన ప్రజా ప్రభుత్వం సహకారంతో ప్రతి పంటకు సాగు నీరు అందించామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,మార్కెట్ కమిటీ చైర్మన్,ప్రభుత్వ అధికారులు,రైతు సమితి సభ్యులు,ప్రజాప్రతినిధులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అడవిశ్రీరాంపూర్ ఆలయ నిర్మాణానికి మద్దెల రాజయ్య భారీ విరాళం.

**ముత్తారం,పెద్దపెల్లి,ఏప్రిల్18(ప్రజాక్షేత్రం):** ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ సహిత,శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప,విగ్నేశ్వరా సుబ్రమణ్య స్వామి దేవాలయానికి కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య వెంకటలక్ష్మి దంపతులు 40,116. రూపాయలను విరాళముగా అందజేశారు.ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ గ్రామంలోని పేదలను ఆదుకోవడంలో ముందుంటానని అన్నారు. అదే విధంగా గ్రామీణ ఆరాధ్య దైవాలైనా దేవుళ్ళ గుడి నిర్మాణం కోసం తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు.తొందరగా ఆలయం పనులు పూర్తవ్వాలని ఆకాంక్షించారు.వారికీ వారి కుటుంబానికి ఆ దేవా దేవుళ్ళ ఆశీస్సులు ఉండాలని ఆలయ నిర్మాణ కమిటీ నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో కోట్టే ఉపేందర్,మోత్కూరి(పొన్నం) కుమార్ యాదవ్,పెయ్యాల భాస్కర్ లు ఉన్నారు.



# టిడిపి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన విశాఖ ఎంపీ భరత్

**విశాఖపట్నం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** టిడిపి సంస్థ గత ఎన్నికలలో భాగంగా శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుండి పార్టీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు.ప్రతి వార్డులో కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరిగే విధంగా దోహదపడాలని చెప్పారు.మీ వార్డులలో సమావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయం మేరకు కమిటీని ఎన్నుకోవాలని సూచించారు. మీ వార్డు కమిటీ ఎన్నిక ఏకాభిప్రాయంతో సాధ్యం కాకపోతే జిల్లా అధ్యక్షులు బాబ్జి దృష్టికి తీసుకురావాలని అన్నారు.శాసనమండలి మాజీ సభ్యులు దువ్వారపు రామారావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం నాయకులు భరత్ కార్పొరేటర్ హనోక్,మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాల నాయుడు తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.




# వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

- దేశంలో మత ఘర్షణలు పెట్టే ప్రయత్నాన్ని మోడీ సర్కారు విరమించుకోవాలి
- ఆవాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జబ్బర్

**వనపర్తి ప్రతినిధి ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** మోడీ సర్కార్ వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసి మత ఘర్షణలు సృష్టించేందుకే సవరణ బిల్లు తెచ్చారని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జబ్బర్ అన్నారు శుక్రవారం కొత్తకోట టౌన్ ముస్లింలు నమజ్ చేసుకొని వివిధ ప్రజా సంఘాలనాయకులు ముస్లిం మతపెద్దలు అవాజ్ సంఘమ్ జిల్లా నాయకుల ఆధ్వర్యములో కొత్తకోట బస్టాండ్ రోడ్ వెంట ర్యాలీగా నినాదాలు చేస్తూ ఊరేగింపుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమములో అవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యండి జబ్బార్ మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టం బిల్లును వ్యతిరేకిస్తూ దేశం వ్యాప్తంగా ఆందోళనలను చేపడుతున్నామని అన్నారు. ముస్లింలు ఈ దేశ మూలవాసులని వారి హక్కు 75సంవత్సరాలదని అట్టి వాక్ఫ్ ఆస్తులను తూట్లు పొడిచి ఆస్తులను అన్యాక్రాంతం చేసి దేశములో మత ఘర్షణాలు పెట్టె ప్రయత్నన్ని కేద్రం మోడీ సర్కర్ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నిక్సన్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎండి ఖాజా, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా యాతాకుల రాజన్న మాదిగ జన్మదిన వేడుకలు

**సూర్యాపేట ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** సూర్యాపేట ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ జన్మదిన వేడుకలను శుక్ర వారం ఘనంగా నిర్వహించారు మేడి కృష్ణ కలనేత గంట బిక్షపతి, ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రం లోని బాబు జగ్జీవన్ రావు భవనంలో కేక్ కట్ చేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాతాకుల రాజన్న పుట్టినరోజు వేడుకలు కార్యకర్తలు ఎవరు ఆడంబరాలకు పోకుండా పేదవారు నిరాశల మధ్య తన పుట్టినరోజు వేడుకలు నాయకులు, కార్యకర్తలు ఇలా నిరాశ్రయుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరపడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి సీనియర్ నాయకులు బోడ శ్రీరాములు మాదిగ, ఎర్ర వీరస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, బొజ్జ సైదులు మాదిగ, ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు, వలపట్ల కృష్ణ మాదిగ, వలపట్ల దయానంద మాదిగ, నియోజకవర్గ ఇన్చార్జి ములకలపల్లి రవి మాదిగ, ములకపల్లి మల్లేష్ మాదిగ, బొడ్డు విజయ్ మాదిగ, సిరపంగి లింగస్వామి, మేడి కృష్ణ మాదిగ, చెరుకుపల్లి సతీష్ మాదిగ చెరుకుపల్లి కిరణ్ మాదిగ, తాటిపాముల నవీన్ మాదిగ, సిరపంగి నవీన్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.




# వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ

**ఖమ్మం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** ఖమ్మం జిల్లా వెంకటగిరిలో వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా ముస్లిం ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు.ఇందిరమ్మ ఫేస్ 1,ఫేస్ 2 కాలనీలతో పాటు గుదిమల్ల ప్రాంతాల నుంచి ముస్లింలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మహ్మద్ అజ్గర్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టాన్ని ముస్లింల హక్కులకు వ్యతిరేకంగా రూపొందించారని ఆరోపించారు.ఈ చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ముస్లింల సమైక్యతతోనే తమ హక్కులను పరిరక్షించుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి,షాదీవుబారక్ చెక్కుల పంపిణీ.

**కొండాపూర్ తహసిల్దార్ అశోక్.**

**కొండాపూర్,ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం):** కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు కొండాపూర్ మండలానికి సంబంధించి 54 చెక్కులు రావడం జరిగిందని కొండాపూర్ తహసిల్దార్ బి. అశోక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల లబ్ధిదారులు ఈరోజు ఉదయం 10 గంటలకు పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న పి ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కావున లబ్ధిదారులు అందరూ వచ్చి చెక్కులు తీసుకోవాలని అన్నారు.



# భక్తులకు భద్రాచలం తలంబ్రాలను అందిస్తున్న ఆర్టీసీ కండక్టర్

**శంకర్ పల్లి ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** ప్రజల వద్దకు సేవలను మరింత చేరువ చేసేందుకు ఆర్టీసీ కృషి చేస్తోందని ఆర్టీసీ ఉద్యోగి కండక్టర్ రాజు అన్నారు. భద్రాచలం సీతారా ములు కల్యాణ తలంబ్రాల కోసం ముందుగా బుక్ చేసుకున్న శంకర్ పల్లి మండల ప్రజలకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం సీతారాములు కల్యాణ తలంబ్రాలు కావాలనుకునేవారు ఆర్టీసీ కార్గో సేవల ద్వారా బుక్ చేసుకోవాలని ముందుగా ప్రచారం చేసి నట్లు చెప్పారు. అప్పుడు బుక్ చేసుకున్నవారికి భద్రాచలం నుంచి కార్గో సర్వీస్ ద్వారా ప్యాకిం గ్లో లో వచ్చిన తలంబ్రాలను అందజేస్తున్నట్టు తెలిపారు. ఆర్టీసీ సేవలను విస్తరించేందుకు ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.





## చిన్నాముషీడి వాడలో 97 వార్డ్ లో డోమినియన్ ప్రొఫెటిక్ చర్చి లో గుడ్ ఫ్రైడే వేడుకలు.

**విశాఖపట్నం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం);**చిన్నాముషీడివాడ పరిసర ప్రాంతాల్లో చర్చి సభ్యులు అందరు కలిసి ర్యాలీ నిర్వహించారు..సభ్యులు అందరు కలిసి క్రీస్తు మహారాజ్ కి జై అని నినాదాలతో చిన్నాముషీడి వాడ వీధుల్లో తిరిగారు.దినిలో భాగంగా పాస్టర్ జాకబ్ జోయె మాట్లాడుతూ క్రీస్తు సిలువ బలియాగం లో పలికిన ఏడు మాటలు,మానవాళి పాప పరిహార్ధం కోసం యేసుప్రభూ సిలువ వెయబడి తిరిగి పునరుద్ధరనించాడు.దీనిని గ్యాపకం చేసుకుంటూ ఈ రోజు గుడ్ ఫ్రైడే ఆచరించడం జరిగింది.

## చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ గా అంబటి రాంబాబు

**ఏలూరు జిల్లా,ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం):**

చింతలపూడి నగర పంచాయతీ కమీషనర్ గా అంబటి రాంబాబు బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన కమీషనర్ పావని అనంతపురం బదిలీ అయ్యారు.జగ్గయ్యపేట మున్సిపాలిటీ లో పనిచేస్తున్న రాంబాబు పదోన్నతి పై చింతలపూడి కమీషనర్ గా శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు.



## సోనియా,రాహుల్ గాంధీ పై చార్జిషీట్ ను ఖండించిన కనకాచారి

**వలిగొండ,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా,రాహుల్ గాంధీ పై ఈడీ చార్జ్ షీటు దాఖలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు వలిగొండ మండల ఓబీసీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలకమర్రి కనకా చారి పేర్కొన్నారు.దేశంలో కాంగ్రెస్ ఎదగడాని చూసి జీర్ణించుకోలేకపోతుందని అన్నారు.ఇది ముమ్మాటికి రాజకీయ ప్రతికార చర్య అని అన్నారు. వెంటనే ఛార్జ్ షీట్ ను ఉపసంహరించుకోవాలని అన్నారు.



## సుంకిశాల గ్రామంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**వలిగొండ,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెరుకు సత్యనారాయణ గౌడ్ కు సీఎం ఫండ్ చెక్కును అరవై వేల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చెరుకు శివయ్య గౌడ్,మచ్చ గిరి గుట్ట డైరెక్టర్ ఈతపరాములు,పోలేపల్లి బాలకృష్ణ,ఎల్ల స్వామి, రమేష్,సత్యనారాయణ రెడ్డి, శంకరయ్య,బిక్షపతి, మల్లారెడ్డి,కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభువు చూపిన మార్గం ఆచరణీయం, ఆదర్శనియం: వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**ఖమ్మం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**వైరా టౌన్ లో ఏసు ప్రభువు శెలువ మోసి,మహిళ మణులందరికి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలను వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తెలిపారు. గుడ్ ఫ్రైడే పండుగ సంధర్భంగా వైరా టౌన్ ఆర్ సీఎం చర్చ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన శెలువ యాత్ర లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ సీఎం చర్చ్ ఫాదర్స్ పాల్గొన్నారు.



## సంగారెడ్డి సెంట్రల్ జైల్లో ఖైదీ మృతి..

**సంగారెడ్డి ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

సంగారెడ్డి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఒక ఖైదీ గుండెపోటుతో మరణించాడు. జైలు సూపరింటెండెంట్ సంతోష్ రాయ్ తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా నర్సాపూర్ కు చెందిన వీ.వెంకటేశ్వర్లు (39) ఓ గంజాయి కేసులో నిందితుడిగా ఈ నెల 3న సెంట్రల్ జైల్లో రిమాండ్ కు వచ్చాడు. అయితే ఈ నెల 17 బుధవారం రాత్రి అతనికి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. వెంటనే అక్కడే ఉన్న వైద్య సిబ్బంది అతనికి ప్రథమ చికిత్స చేశారు. కొద్దిగా కోలుకున్నాడు అనే లోపు మళ్ళీ అర్ధరాత్రి ఒక్కసారిగా కింద పడిపోయాడు. అతడిని పరీక్షించిన సెంట్రల్ జైలు వైద్యులు, సిబ్బంది వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి ఉదయం 5.30 గంటల ప్రాంతంలో తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం రిపోర్ట్ అనంతరం ఖైదీ మృతికి గుండెపోటు కారణమా, ఇంకా ఏదైనా కారణమా అనే విషయం స్పష్టమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

# సన్నవడ్లకు బోనస్ అందించడంలో రాష్ట్రంలోనే పెద్దపల్లి టాప్..!

- రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావు



**సుల్తానాబాద్, ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**గత వానకాలం సీజన్ లో సన్నవడ్లకు రాష్ట్రం మొత్తం మీద నియోజకవర్గంలోనే రైతులు అత్యధికంగా బోనస్ పొంది, రాష్టంలోనే పెద్దపల్లి టాప్ గా నిలిచిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లె, గొల్లపల్లి, సాంబయ్యపల్లి, ఐతరాజుపల్లి, భూపతిపూర్, గర్రెపల్లి, బొంతకుంటపల్లి, నర్సయ్యపల్లి, నీరుకుల్ల, గట్టేపల్లి, కదంబాపూర్, తొగర్రాయి గ్రామాల్లో సింగిల్ విండో,ఐకేపీ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పెద్దపల్లి శాసనసభ్యులు సి.హెచ్ విజయరమణ రావు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు.ఆరుగాలం కష్టపడి, చెమటోడ్చి పండించిన రైతుల కష్టార్జితాన్ని గత ప్రభుత్వంలోని పెద్దలు కటింగ్ ల పేరిట ఏ విధంగా అవినీతికి పాల్పడినారో ప్రజలందరికీ తెలుసని అన్నారు. తాము పూర్తి పారదర్శకంగా రైతులకు న్యాయం చేకూర్చేందుకు పనిచేస్తున్నామని చెప్పారు. అధికారంలో లేనప్పుడు వడ్ల కటింగ్ లకు వ్యతిరేకంగా పోరాటం చేశామని, ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మాటకు కట్టుబడి, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఎక్కడ కటింగ్ లు లేకుండా వడ్ల కొనుగోలు జరుపుతున్నామని చెప్పారు. ఈ సారి కూడా సన్న వడ్లకు బోనస్ అందిస్తామని చెప్పారు. గత సీజన్లో సన్న వడ్ల బోనస్ రాష్ట్ర మొత్తం మీద ప్రభుత్వం రైతులకు 1234 కోట్ల రూపాయలు అందించగా, అందులో ఒక్క పెద్దపల్లి నియోజకవర్గంలోనే అత్యధికంగా 59 కోట్ల 65 లక్షల రూపాయల బోనస్ ను రైతులు పొందారని చెప్పారు.

**వర్షా ల వల్ల పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దు: ఎమ్మెల్యే**

అకాల వర్షాల వల్ల దురదృష్టవశాత్తు పంటలకు నష్టం జరిగితే రైతులు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. దెబ్బతిన్న వడ్లను కూడా కొనుగోలు చేసే విధంగా కృషి చేస్తానని చెప్పారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ లు శ్రీగిరి శ్రీనివాస్, సందీప్ రావు, వినమల్ల రెడ్డి మరియు మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, మండల పార్టీ అధ్యక్షుడు చిలుక సతీష్, డిపిఎం నాగేశ్వర్ రావు, ఏపిఎం లు, అధికారులు కాంగ్రెస్ నాయకులు పన్నాల రాములు, కళ్యేపల్లి జానీ, తిరుమల్ రావు, గుజ్జెట్టి వెంకన్న, బండారి రమేష్, బక్కయ్య, రాజి రెడ్డి, తిరుపతి రెడ్డి, పులి వెంకటేషం, బొజ్జ అజయ్, మురళి, ఆర్నకొండ సాగర్, గడ్డం అనిల్, పోచంపల్లి రాజు మరియు మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీలు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ సన్నహాక సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొనాలి

**వలిగొండ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి**

**వలిగొండ,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**ఏప్రిల్ 27 వ తేదిన వరంగల్లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి,నేడు వలిగొండ పట్టణ కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో జరిగే మండల సన్నాహక సమావేశానికి,భువనగిరి మాజీ శాసనసభ్యులు పైల శేఖర్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి హాజరవుతారని అన్నారు.ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.





## గుడ్ ఫ్రైడే సందర్భంగాసిలువను మోసిన డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్

**ఖమ్మం,ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం):**జీసస్ ఏసుక్రీస్తు మానవాళి కోసం చేసిన త్యాగం ఈరోజు గుర్తు చేసుకోవాల్సిన అవసరం చాలా ఉందని,క్రీస్తు జీవితకాలంలో చేసిన ప్రేమ దయ క్షమాభిక్ష లాంటి బోధనలు ప్రపంచంలో సూర్య చంద్రులు ఉన్నంతవరకు శాంతి సందేశాలుగా నిలిచిపోతాయని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు.

కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవ మత విశ్వాసపరులు గ్రామంలో సిలువను మోస్తూ క్రీస్తు ప్రార్థనల తో భారీగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ క్రైస్తవులతోపాటు తాను సైతం సిలువను మోసి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే మానవాళి చేసిన పాపాలకు తాను సిలువ వేయబడ్డాడని,జీసస్ శత్రువుల పట్ల కరుణ, అనాథల కొరకు దయ ప్రేమ, ప్రజల పట్ల త్యాగం లాంటివి మనమందరం స్ఫూర్తిదాయకంగా,ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.లోకంలో అధర్మం పెరిగినప్పుడు కొన్ని కాలాల్లో కొంతమంది మహాపురుషులు జన్మిస్తారని, 2000 సంవత్సరాల క్రితం జీసస్ అవతరించి ఆనాడు జరిగే రాజుల నిరంకుశత్వాన్ని ప్రశ్నించి, వివిధ ప్రాంతాల్లో తిరిగి కుష్టు మూగ గుడ్డి వారిని తన మహిమలతో, తన బోధనలతో బాగు చేయడం జరిగిందని, దీనిని జీర్ణించుకోలేని నాటి రాజులు తనపై రాజద్రోహ నేరం మోపి సిలువ వేయడం జరిగిందని, శిలువపై రక్త మోడుతున్నప్పటికీ క్షమ దయ తో తనను శిక్షించే వారిని సైతం క్షమించమని యెహోవాను ప్రార్థించారని బైబిల్ చెపుతుందని తెలిపారు.40 రోజులపాటు దీక్షతో ఉన్నవారిని,ఈరోజు ఉపవాసం ఉండి ఈ కార్యక్రమం చేయుచున్న వారందరిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్,గుండ్ల వెంకన్న మోదుగు ఆనందరావు,ఆదూరి వీరమ్మ, పలిమల ఆరోగ్యం,క్రైస్తవ మత విశ్వాసపరులు,పరిజన స్త్రీలు,పురుషులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యో.. రామచిలుక ఎంత పనిచేసింది..! పోలీస్ స్టేషన్ కు చేరిన పంచాయితీ..



**హన్మకొండ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**చిలుక చేసిన పనికి చిలుక జ్యోతిష్యుడు, బైక్ మెకానిక్ మధ్య వివాదం చోటు చేసుకుంది. మాటామాటా పెరిగి విషయం పోలీస్ స్టేషన్ వద్దకు చేరింది. హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. పరకాల పట్టణం అంబేద్కర్ క్రాస్ సమీపంలో దాస్ అనే వ్యక్తి బైక్ మెకానిక్ గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం దుకాణంలో ఉన్న దాస్ వద్దకు చిలుక జ్యోతిష్యుడు వచ్చాడు. చిలుక జోస్యం చెబుతానని చెప్పాడు. దీనికి దాస్ కూడా సరే అనడంతో చిలుక జోస్యం చెప్పేందుకు జ్యోతిష్యుడు సిద్ధమయ్యాడు. చిలుక తీసిన బొమ్మను చూసి రూ.1,650 ఇస్తే తాయత్తు కడతానని జ్యోతిష్యుడు చెప్పాడు. ప్రస్తుతం తన వద్ద అంత సొమ్ము లేదు..సాయంత్రం రావాలని సూచించడంతో జ్యోతిష్యుడు అక్కడి నుంచి వెళ్లిపోయి.. సాయంత్రం మళ్లీ దాస్ వద్దకు వచ్చాడు. చిలుక మళ్లీ అదే బొమ్మను తీస్తే తాయత్తు కట్టించుకుంటానని దాస్ చెప్పడంతో జ్యోతిష్యుడు మళ్లీ చిలుక జోస్యం చెప్పేందుకు పంజరంలోని చిలుకను బయటకు పిలిచాడు. పలుసార్లు పంజరంలో ఉన్న చిలుకను పిలుస్తూనే నిద్రలోకి జారుకున్నాడు. అదే సమయంలో చిలుక బయటకు వచ్చి కార్డు ముక్క తీసే క్రమంలో పక్కనే ఉన్న టైర్ పేలి పెద్దశబ్దం వచ్చింది. దీంతో చిలుక భయంతో ఎగిరిపోయి పక్కనే ఉన్న టవర్ పై వాలింది. నిద్రమత్తు నుంచి తేరుకున్న జ్యోతిష్యుడు చిలుకను పట్టుకునేందుకు వెళ్లినా అది దొరకకుండా ఎగిరిపోయింది. జ్యోతిష్యుడి బాధచూడలేక మెకానిక్ దాస్ అతన్ని వైన్స్ వద్దకు తీసుకెళ్లి మద్యం కొనిచ్చాడు. కొద్దిసేపటి తరువాత జ్యోతిష్యుడు దాస్ ఇంటికి వెళ్లి నీవల్లే నా చిలుక ఎగిరిపోయిందంటూ గొడవకు దిగాడు. వీరి మధ్య మాటామాటా పెరగడంతో వివాదం తీవ్రమైంది. మూడు రోజుల క్రితం జ్యోతిష్యుడు పోలీస్ స్టేషన్లో దాస్ పై ఫిర్యాదు చేశాడు. నా చిలుకను దాస్ మాయం చేశాడని పోలీసుల వద్ద వాపోయాడు. దీంతో పోలీసులు దాస్ ను పిలిచి రామచిలుక ఏమైందని ప్రశ్నించారు. కొద్ది గంటలపాటు జ్యోతిష్యుడు, దాస్ మధ్య వాదోపవాదనలు జరిగాయి. పంచాయితీ ఎటూ తేలకపోవటంతో జ్యోతిష్యుడికి నచ్చజెప్పి పంపించి వేశారు.

## సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

**ఖమ్మం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

ముదిగొండ మండల పరిధిలోని ముదిగొండ మరియు వనంవారి కిష్టాపురం గ్రామాలలో పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణి కార్యక్రమమును ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ గ్రామాల వారీగా మే నెల 16 వరకు అన్ని గ్రామాలలో టీకాల కార్యక్రమమును పూర్తి చేయడం జరుగుతుందని మండల పశు వైద్యాధికారి డా పి.అశోక్ తెలిపారు.కావున రైతులందరు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమములో పశువైద్య సిబ్బంది మరియు గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.




## మారెమ్మ తల్లి గుడి నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం లో పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్

**ఖమ్మం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి పల్లి మారెమ్మ తల్లి గుడి నూతన కమిటీ ప్రమాణ స్వీకారమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి పాల్గొనీ నూతన చైర్మన్ మరియు డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లీ ఎయంసీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు,ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకట్ రెడ్డి,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లా రెడ్డి,భుజంగ రెడ్డి,ధారావత్ రామ్మూర్తి నాయక్,భూక్యా సురేష్ నాయక్,మద్దులపల్లీ ఎయంసీ డైరెక్టర్ భద్రకాళి, టెలికాం డైరెక్టర్ రంజిత్ నాయక్,అజ్మీరా,అశోక్, మద్ది.కిషోర్.రెడ్డి,సిలివేరు బాబు,ఉపేందర్,రమేష్,సురేష్,కళ్లెం శేష్ రెడ్డి,రవి,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## శిల్పారామంలో ఆకట్టుకున్న సంస్కృతిక కార్యక్రమాలు

**శేరిలింగంపల్లి ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

మాదాపూర్ శిల్పారామంలో వారాంతపు సంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శిల్పారామం మాదాపూర్ లో సాంస్కృతిక కార్యక్రమాలు న్యూ జెర్సీ నుండి విచ్చేసిన కూచిపూడి కళాకారిణి నీలిమ రాజు తన ప్రదర్శనలో కృష్ణ పంచకం, నారాయణీయం, వీక్షేదా దేవ దేవం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. సంచలన స్కూల్ అఫ్ డాన్స్ నాట్య గురువు పద్మ కళ్యాణ్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహనం, గంధము పూయరుగా, జనుత శబదం, చిన్న వినాయక కౌతం, జయ జయ దుర్గే, నీల మేఘ శరీర, దశావతారం అంశాలను కృతిక, కుందన, శాన్విక, శ్రీలత, సహస్ర, వన్య, నేత్ర, ఉష శ్రీ, సాహితి, ఆశ్రిత, చక్రికా, రిధి ప్రదర్శించిన సంస్కృతి కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అల్లరించాయి.





# మృతుల కుటుంబాలకు పుట్ట మధుకర్ పరామర్శ.

**మంథని,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** మంథని మండలం నాగేపల్లి గ్రామంలో దబ్బెట సత్తయ్య,దబ్బెట వెంకటమ్మ లు ఇటీవల మరణించగ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాడు.మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకోని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాడు.తన వెంట పలువురు ఉన్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎస్సీ ఎస్టి చైర్మన్ బక్కి వెంకటయ్య

**చివ్వేంల,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** శుక్రవారం మున్యా నాయక్ తండాలో బానోత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎస్సి,ఎస్టీ తెలంగాణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన తండాలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ చెయడం చాలా సంతోషకరం అందరు అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక అసమానతలు లేని సమ సమాజం నిర్మించటమే అంబేద్కర్ కి ఇచ్చే ఘనమైన నివాళి.భారత రాజ్యాంగ నిర్మాత ఆర్థిక వేత్త హక్కుల నేత భారత రత్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ చదువుతోనే ఏదైనా సాధించవచ్చు అని, నిరూపించిన మహా మేధావి . వెలివాడలో బ్రతుకుతున్న జీవితాల్లో వెలుగులు నింపిన నీతి సూర్యుడు అని, యావత్తు దేశం కూడా ఆయన బాటలో నడవాలని వారు పిలుపునిచ్చారు. కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపిన జ్ఞాన యోధుడు,స్త్రీల హక్కుల కోసం తన పదవిని సైతం త్రుణ ప్రాయంగా వదిలిన త్యాగధనుడన్నారు. ఈ కార్యక్రమం లో ట్రైకర్ కార్పొరేషన్ మాజి చైర్మన్ రాంచందర్ నాయక్, డిటిడిఓ శంకర్,డి ఎస్ సీడీవో లత, ఎమ్మార్వో క్రిష్ణయ్య,లంబాడి విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు ధరవత్ బాలు నాయక్ శ్రీ బాలాజీ అసోసియేట్స్ ఎండి శివ నాగు నాయక్, ఏ ఎఫ్ ఓ కన్సల్టెన్సీ చైర్మన్ ప్రసాద్, నాయక్ స్థానిక సర్పంచ్ బికారు నాయక్,ఎంపీటీసీ సాగర్ నాయక్,భగవాన్ నాయక్,కోట నాయక్,లక్ పతి నాయక్,లింగ నాయక్, సేవాలాల్ సేన స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ నాయక్, బ్యాంకు మేనేజర్ సంతోష్ నాయక్,రాజా నాయక్,నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# నూతన వధూవరులను ఆశీర్వదించిన జర్నలిస్టులు

**వలిగొండ,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** భువనగిరి పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి కన్వెంక్షన్ లో వలిగొండ మండల కేంద్రానికి చెందిన బి ఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకులు బల్గూరి నరేష్ రెడ్డి కీర్తన వ్యూహానికి వలిగొండ మాజీ సర్పంచ్ పబ్బు ఉపేందర్ బోస్,వలిగొండ మండల జర్నలిస్టులు, రాపోలు సుదర్శన్ బోడుగే సుదర్శన్ గౌడ్,మారగొని శ్రీనివాస్ గౌడ్,బాలగోని హనుమంత్ గౌడ్,దంతూరి లక్ష్మయ్య,రెబ్బ కుమారస్వామి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన డిసిసి చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి

**నారాయణపురం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా, నారాయణపురం మండల పరిధిలోని సర్వేల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఐ కే పీ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నల్గొండ డిసిసి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, వెలిమినేడు పిఏసిఎస్ రఘుమా రెడ్డి,గుజ్జ పిఏసిఎస్ దూడ యాదిరెడ్డి, ప్రారంభించారు.అనంతరం మండలంలోని గ్రామాలకు సంబంధించిన ఐకేపీ సెంటర్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ధాన్యం బస్తా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణపురం డిప్యూటీ ఎమ్మార్వో పండు,పిఏసిఎస్ వైస్ చైర్మన్ చేన్నోజు బ్రహ్మచారి,సీఈఓ శ్రీకాంత్ రెడ్డి,ఏవో సుర్వి నవ్య, నారాయణపురం ఏవో వర్షిత, పి ఏ ఎస్ సి డైరెక్టర్ పగిళ్ల యాదయ్య,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నర్రి నరసింహ,నలపరాజు పద్మ స్వామి,వెనుముల జగన్ రెడ్డి, వర్ధం నాగార్జున,వీరమల్ల జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# కోరమండల్ స్మశానవాటిక లో అభివృద్ధి పనులు..

- కోటి 80 లక్షలు నిధులతో నవీకరణ
- పార్టీలకు అతీతంగా స్మశాన వాటిక ఆధునికరించేందుకు కొత్త నమూనాలకు పరిశీలించిన ప్రజా నాయకుడు
- ఏడు వార్డులు ప్రజల ఆవశ్యకతకు తెర రూపమే స్మశాన వాటికలో అభివృద్ధి పనులు - కార్పొరేటర్ పీవీ సురేష్



**విశాఖపట్నం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం స్మశాన వాటిక లో అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయి పనులు ప్రారంభం నుంచి అవరోధాలు ఎదురవుతున్నాయి అంటున్నారు. ఈమధ్య శవాలను పీకుతున్న వరాహమని వార్తల్లోకి వచ్చిన విషయం అందరికీ తెలిసిందే. అభివృద్ధి పనులు సజావుగా సాగాలంటే కాంట్రాక్టర్ కి ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.స్థానిక నాయకులు పలోబాలు కూడా కాంట్రాక్టర్ పై ఉన్నాయని సమాచారం. ఏదేమైనా ఏడువార్డుల ప్రజల చిరకాల వాంఛ ఈ స్మశాన వాటిక అభివృద్ధి పనులు సర్వేగంగా చేయాలి అంటున్నారు స్థానిక ప్రజలు. స్మశానంలో హిందువులు క్రైస్తవులు బంధువులు చనిపోతే ఒకపక్క హిందువులకి మరోపక్క క్రైస్తవులకి వారి వారి సాంప్రదాయాలకు అనుగుణంగా (దహనం )ఖననం చేసేందుకు గతంలో ఉండేది.క్రైస్తవులు కొంతమంది బంధువులు ప్రీతితో శిలాఫలకాలు ఏర్పరచుకోవడంతో స్మశాన వాటిక మరింత చిన్నది అయిపోయింది.ఇలాంటి తరుణంలో కరోనా సమయంలో తెప్పలు తెప్పలుగా వచ్చే మృతదేహాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సమయం అందరికీ తెలిసిందే. ఆధునికరిస్తున్న స్మశాన వాటిక మరింత చిన్నదని అభిప్రాయపడుతున్నారు స్థానిక ప్రజలు.పెద్ద పెద్ద గోపురాలు నిర్మించడం వలన ఆధునిక హంగులు ఏర్పాటు చేయడం వలన స్మశాన వాటికి ఓ ప్రత్యేక గుర్తింపు వాటిల్లుతుంది అని చెప్పడంలో సందేహం లేదు. కానీ జనసాంద్రత ఎక్కువగా ఉన్న సమయంలో స్మశాన వాటిక పరిధి కూడా పెరగాలని అభిప్రాయపడుతున్నారు మరి కొంతమంది. పశ్చిమంలో ఖాళీ భూమి కనిపిస్తే చాలు కబ్జాకి గురైపోతున్న తరుణంలో ఆరడుగుల శరీరాన్ని తగలబెట్టేందుకు ఈ స్థలం చాలు అనుకుంటే తప్పేముంది అంటున్నారు మరి కొంతమంది. నాయకులు గుర్తించిన నమూనాతో ఈ స్మశానవాటిక ఆధునికకారణ పనులు జరిగితే మాత్రం అన్నిటికీ కన్నా మిన్నగా స్మశాన వాటికకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని రాజకీయ నాయకులు వాపోతున్నారు.కోటి 80 లక్షల రూపాయలు నిధులతో వివిధ రకాల అధునాతన గోపురాలతో స్మశాన వాటికకు అభివృద్ధి పనులకు బీజం వాటిల్లింది, కొన్ని రోజులు ఆలస్యమైనా నాయకులు కోరుకునే తీరులో ఇక్కడ ఆ గోపురాలు ప్రజల్ని ఆకర్షిస్తాయి చనిపోయే శవాలకి ఓ ప్రత్యేక గౌరవ మర్యాద వాటిల్లుతుందని అభిప్రాయపడుతున్నారు నాయకులు. విజయనగరం జిల్లాలో ఓ స్మశాన వాటికలో నచ్చిన గోపురాలు నమూనాలను స్థానిక నాయకులు పరిశీలించి వాటినే మన వార్డులో నిర్మిస్తే బాగుంటుందని అభిప్రాయపడి నాయకులు ఎమ్మెల్యే వరకు తెలియపరచి జీవీఎంసీ కౌన్సిల్లో అనుమతులు పొందారని తెలియజేశారు.

**సాధారణంగా స్మశాన వాటికలో ముఖ్యమైన ఆవశ్యకత ఏమిటి**

ఇప్పటికీ రాజమండ్రి లో ఓ స్వచ్ఛంద సంస్థ స్పాన్సర్ తో స్మశాన వాటికలు అధునాతన సాంకేతికత మరియు బ్యూటిఫికేషన్ వర్కులు చాలా అందంగా చేసి తీర్చిదిద్దారు స్మశాన వాటిక హంగులు ఆర్భాటాలు చూస్తే అదరహో అనాల్సిందే స్పాన్సర్లు ఆ రీతిలో కృషి చేయడం అభినందించాల్సిన విషయం .

శవాలను దహనపరిచేందుకు ఒకేసారి 4, 6 ,8 ,యూనిట్లు ఉండాలి (చితి పెట్టేందుకు ) బంధువులు కూర్చునేందుకు మరియు స్థానమాచరించేందుకు గదులు ఆవశ్యకత ఉంది

శవాల చితా భస్మం స్టోర్ చేసేందుకు లాక్ రూములు ఏర్పాటు చేయాలి

కాట కాపరి ఉండేందుకు ,మరణ ధ్రువీకరణ పత్రాలు నమోదుకు అటెండర్ ఏర్పాటు చేయాలి

విశాఖ కాన్వెంట్ సెంటర్లో ఉన్న స్మశాన వాటికలో ఎలక్ట్రానిక్ విధానంలో దహనపరిచే పరికరం మరమత్తులో ఉంది అలాంటి ఎలక్ట్రానిక్ పరికరాన్ని ఈ స్మశాన వాటికలో ఏర్పరచాలని పలువురు కోరుతున్నారు.

పల్లెల్లో స్మశాన వాటికలే చాలా శుభ్రంగా ఉంటున్నాయి అలాంటిది సిటీ మధ్యలో ఏడువార్డుల జనాల ఆవశ్యకతను తీర్చే స్మశాన వాటిక వచ్చే వృర్థాలను వెంటవెంటనే శుభ్రం చేయాలి గ్రీనరీ కి ప్రాముఖ్యత ఇవ్వాలి స్మశాన వాటికలో గోపురాలు కేవలం ఆచారాలకు సంబంధించినవి మాత్రమే కాదు. అవి అక్కడి నిర్మాణానికి ఒక ప్రత్యేకమైన శైలిని అందిస్తాయి. అంతేకాదు, చనిపోయిన వారికి గౌరవ సూచకంగా కూడా భావిస్తారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో మృతదేహాలు ఖననం చేయడానికి బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం సర్వసాధారణం ప్రతి ఒక్కరు కాంట్రాక్టర్ విధులకు సహకరించాలని ప్రజా నాయకులు కోరుతున్నారు .

# దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

- పూసాలలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో దేవాలయ నూతన కమిటీ
- దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం

**సుల్తానాబాద్ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల లో అతి పురాతనమైన లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ నూతన కమిటీని శుక్రవారం దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన పాలకమండలి దేవాలయ చైర్మన్ గా పురం హరికిషన్, డైరెక్టర్ లు, చొప్పరి సుమన్, గడ్డం శంకర్ గౌడ్, బొజ్జ రమేష్, కలువల స్వరూప, పురోహితులు ప్రద్యుమ్న చారిలను ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరి మహేందర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గతంలో కంటే లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధికి మరింత పాటుపడాలని తెలిపారు. పదవి ఆకాంక్షతో కాకుండా దేవునికి సేవ చేయాలనే దృక్పథంతో ఉండాలని కోరారు. అనంతరం నూతన కమిటీని శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, ఎన్నికకు సహకరించిన పెద్దలకు, కమిటీ సభ్యులకు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, 14వ వార్డు మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్,బిరుదు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు సిద్ధ తిరుపతి, శంభు లింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ వేగోళం శంకర్ గౌడ్, వలస నీలయ్య,వేగోళం శ్రీనివాస్, లంక శంకర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, సంతాన వేణుగోపాల స్వామి చైర్మన్ పల్ల మురళి, శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, కోయ్యడ రమేష్, అమిరి శెట్టి రాజలింగం, సామల హరికృష్ణ, ఉస్తేం రవీందర్, కుమార్ కిషోర్, కనుకుంట్ల శ్రీనివాస్ వేగోళం కరుణాకర్, నాగరాజు, మిట్టపల్లి సదానందం, అమిరి శెట్టి తిరుపతి, గడ్డం అంజి, వైద్య లక్ష్మణ్, వైద్య శివకృష్ణ, పూసాల అంజయ్య, కంకణాల తిరుపతి,పూసాల సురేష్,గుర్రం కనకభూషణం, చొప్పరి లక్ష్మీరాజం, చొప్పరి రాజలింగం చొప్పరి శ్రీనివాస్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారిని ఆశీర్వదించిన.ఏవి.రెడ్డి

**నాంపల్లి,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** నాంపల్లి మండల పరిధిలోని పసునూర్ గ్రామానికి చెందిన రాపోతు కృష్ణ కుమారుడు దార్శిక్ నందన్ డోలరోహన మహోత్సవ కార్యక్రమానికి తాజా మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏవి రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ అబ్బాస్, నాయకులు గెల్వాల్ రెడ్డి, దండిగ సాలయ్య,వీరమల్ల శేఖర్,షేక్ జానీ,చిత్రియాల వెంకన్న,వెంకట్ రెడ్డి,గండికోట రాజు,షేక్ పాషా,మహేష్,రవి తదితరులు పాల్గొన్నారు.



# ఇక్రిశాట్‌లో బంధించిన చిరుత జూకు తరలింపు..

**పటాన్‌చెరువు ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** మండలం ఇక్రిశాట్ క్యాంపస్ లో సంచరిస్తున్న చిరుతను జూపార్కు అధికారులు బంధించి గురువారం జూపార్కుకు తరలించారు. ఇక్రిశాట్ క్యాంపస్‌లో చిరుత సంచరిస్తున్నట్లు ఉద్యోగులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం ఉన్నతాధికారులు సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారులకు తెలిపారు. వారి ఆదేశాల మేరకు జూపార్కు రెస్క్యూ టీమ్ హెడ్ డాక్టర్ ఎం.ఎ హకీమ్ నేతృత్వంలో సిబ్బంది ఇక్రిశాట్‌కు వెళ్లి చిరుతను బోనులో బంధించారు. సుమారు ఆరేళ్ల వయస్సున్న చిరుత ఆరోగ్యంగా ఉందని క్యూరేటర్ జె.వసంత తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమ్రాబాద్ ఫారెస్ట్‌లో వదలిపెడతామన్నారు.





# దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి.. మల్‌రెడ్డికి మంచిరెడ్డి కిషన్ రెడ్డి సవాల్

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ధ్యాస తప్పా.. ప్రజలను, నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకునే సోయిలేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మంత్రి పదవి రాకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని గాలి మాటలు చెప్పటంకాదు.. దమ్ముంటే రాజీనామా చేయాలని మల్‌రెడ్డి రంగారెడ్డికి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడ సీకే కన్వెన్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల మహాసభకు సంబంధించి నిర్వహించిన నియోజకవర్గ సమన్వయకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంత్రి పదవి కోసం ఢిల్లీ పెద్దల చుట్టూ తిరుగుతూ ఏడాదిన్నర కాలంగా కాలం వెల్లదీస్తూ ప్రజా సమస్యలు గాలికొదిలేసిన మల్‌రెడ్డి రంగారెడ్డికి నియోజకవర్గం అభివృద్ధిపై సోయిలేదని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు తప్పా.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్కరూపాయి కూడా విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో భూమిపూజలు చేసి పనులు ప్రారంభించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ దవాఖానా భవన నిర్మాణంతో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు సుందరీకరణ కోసం చేపట్టిన పనులు కూడా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. అలాగే, గత ప్రభుత్వ హయాంలో పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న కూరగాయల మార్కెట్ మడిగెలు, మార్కెట్‌యార్డులోని మడిగెలు ప్రారంభించే ఓపిక కూడా ఈ ఎమ్మెల్యేకు లేదని తెలిపారు. తమకు మంత్రి పదవి రాకపోతే రాజీనామా చేస్తానని గాలి మాటలు మాట్లాడే మల్‌రెడ్డి రంగారెడ్డి..దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి కోరాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అభివృద్ధి కోసం ఒక్క రూపాయి తీసుకురాలేని మల్‌రెడ్డి రంగారెడ్డి లాంటి చేతకాని వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవటం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజల దురదృష్టమని ఆయన గుర్తుచేశారు. ఎన్నికల ముందు కోట్లాది రూపాయల ప్రొసిడింగ్‌లు బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిపనుల కోసం విడుదల చేస్తే అవి పూర్తిగా వెనక్కి మళ్లీపోయే విధంగా ఈ చేతకాని ఎమ్మెల్యే వల్లే జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఎప్పుడైనా ప్రజా సమస్యల పరిష్కారం ఈ ఏడాదిన్నర కాలంగా ప్రజల్లో తిరిగావా మల్‌రెడ్డి రంగారెడ్డి అని మంచిరెడ్డి ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధిని మరిచి ఢిల్లీ పెద్దల చుట్టూ, గాంధీ భవన్ చుట్టూ..ముఖ్యమంత్రి వెనకాల తిరుగుతూ.. కాలం వెల్లదీస్తున్నాడు తప్పా.. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలనే కనీస బాధ్యత లేకుండా ప్రవర్తించటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.

**చేతకాని దద్దమ్మను గెలిపించుకున్న నియోజకవర్గ ప్రజలు దురదృష్టవంతులు : క్యామ మల్లేష్**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం గత పదిహేను సంవత్సరాలుగా అభివృద్ధిలో ఉరకలు వేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్ తెలిపారు. ఎప్పుడైతే ఏడాదిన్నర కాలంగా ఈ ప్రాంతంలో ఓ చేతకాని దద్దమ్మ చేతిలోకి వెళ్లిందో అప్పటినుంచి ఉన్న అభివృద్ధితో పాటు ఈ ప్రాంతం పూర్తిగా శూన్యంగా మారిపోయిందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోని ఓ చేతకాని దద్దమ్మను గెలిపించిన ఇబ్రహీంపట్నం ప్రాంత వాసుల దురదృష్టం అని ఆయన అన్నారు. ఏడాదిన్నర కాలంగా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఏ ఒక్క అభివృద్ధికి కూడా రూపాయి కేటాయించకుండా.. తట్టెడు మట్టి పోయకుండా పనికిమాలిన మాటలు మాట్లాడుతూ.. చుట్టపుచూపుగా ఈ ప్రాంతంలో పర్యటించి వెళ్లడం సిగ్గుచేటని, దమ్ముంటే ఈ ప్రాంత అభివృద్ధి కోసం మల్‌రెడ్డి రంగారెడ్డి తమ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఇబ్రహీంపట్నం నుంచి మరోసారి పోటీచేసి గెలవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దండెం రాంరెడ్డి, జక్క రాంరెడ్డి, ఏర్పుల చంద్రయ్య, కృపేష్, బలరాం, ఆకుల యాదగిరి, బియ్యని జ్ఞానేశ్వర్, అల్వాల వెంకట్‌రెడ్డి, కొప్పు జంగయ్య, పాశం దామోదర్, కల్యాణ్‌నాయక్, బుగ్గ రాములు, రమేష్‌గౌడ్, కిషన్‌గౌడ్, రమేష్, రంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యాదయ్య, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, భరత్‌కుమార్, భరత్‌రెడ్డి, జెర్కోని రాజు, జగదీష్, శివసాయితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం

**జమ్మికుంట,ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఉమామహేశ్వర గార్డెన్స్ లో పుల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పుల్ల ఫ్యామిలీస్ ఆత్మీయ సమ్మేళనంలో హాజరైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ఎస్సీ వర్గీకరణ సాధించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో కృతజ్ఞతలు తెలిపారు అనంతరం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాల క్రితం రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి మాదిగ జాతికి విద్య ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లలో జరుగుతున్న అన్యాయాన్ని ఊరు ఊరుణ వాడ వాడన తిరిగి సైకిల్ యాత్రల పాదయాత్రల రిలే నిరాహార దీక్షలు ఆమరణ దీక్షలు రైలు రోకోలు రాస్తారోకోలు అనేక అవమానాలు జరిగినప్పటికీ వెనకడుగు వెయ్యకుండా వారు చేస్తున్నటువంటి ఉద్యమాల ద్వారా మాదిగ జాతిని చైతన్యం చేసి అనేక ఉద్యమాలు చేశారు షెడ్యూల్ కులాల ఎస్సీ వర్గీకరణ విషయంలో గత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో అనేక అవమానాలు ఇబ్బందులు నిర్బంధాలు అనేక కేసులు జైల్లో పెట్టినప్పటికీ కూడా అధైర్య పడకుండా తన కుటుంబాన్ని సైతం విడిచిపెట్టి భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు తిరిగి మాదిగ జాతి ప్రజలను చైతన్యం చేసి షెడ్యూల్ కులాల ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పించి మెప్పించి రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదింపజేసిన ఘనత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగకే దక్కిందన్నారు మాదిగ జాతి మొత్తం మందకృష్ణ మాదిగకు రుణపడి ఉంటారని షెడ్యూలు కులాల ఎస్సీ వర్గీకరణ తొలి ఫలితమే తమ కుటుంబానికి జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ గా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రిపొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాబు అవకాశం కల్పించారని వారికి తమ కుటుంబం ఎల్లవేళలా రుణపడి ఉంటామని అన్నారు వికలాంగుల కోసం వితంతువుల కోసం చిన్న పిల్లలు గుండె జబ్బులతో ఇబ్బంది పడుతున్న విషయాలను అప్పటి ముఖ్య మంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టించి చిన్నపిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్ చేపించి వితంతులకు వికలాంగులకు పెన్షన్స్ పెరుగుదల సౌకర్యం కల్పించిన ఘనత మందకృష్ణ మాదిగ దక్కిందన్నారు ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకట్ స్వామి జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గిటి సదానందం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు తదితరులు పాల్గొన్నారు

# వృద్ధురాలి గొలుసును లాక్కున్న దొంగ అరెస్టు

- 3.5 తులాల బంగారం స్వాధీనం
- అంతర్ జిల్లా దొంగ అల్లెపు కృష్ణ అరెస్ట్




**జమ్మికుంట,ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం):** హుజురాబాద్ ఏసీపి శ్రీనివాస్ జి అటెన్షన్ డైవర్షన్ కేసుల గురించి వివరిస్తూ ఈ మధ్య జరిగిన తేది.15042025 రోజున ఉదయం అందాద 09:00 గంటలకు అల్లెపురెడ్డి కమలమ్మ డబ్లు /ఓ కొమురెడ్డి కలిసి తనకు ఆరోగ్యం బాగోలేనందున జమ్మికుంటలోని వరుణ్ సాయి ఆసుపత్రికి వెళ్ళినారు. ఆసుపత్రిలో డాక్టర్ లేనందున తను, తన భర్త ఇద్దరు కలిసి ఇంట్లో సామాన్లు తీసుకుందాం అని కొండూరి. కాంప్లెక్స్ దగ్గరికి వెళ్ళి అక్కడ మెట్ల మీద కూర్చున్నారు. వీరు కూర్చున్న వద్దకు అల్లెపు కృష్ణ ఎస్ /ఓ వెంకటయ్య, వయసు 47 సంవత్సరాలు సిద్దిపేట జిల్లా వడ్డెర కాలనీ అను అతను అమ్మ నేను కనపర్తి కార్యదర్శిని మీ ఇద్దరికి 4000 / పెన్షన్ పెట్టిస్తా, మీ ఇద్దరివి ఆధార్కార్డ్స్ జిరాక్స్లు కావాలి అని అన్నాడు. ఉదయం పూట మీ ఇంటకి వెళ్తే మీరు ఎవరు లేరు. మళ్ళీ ఇప్పుడు ఇక్కడ కనబడ్డారు అని అన్నాడు. అతని మాటలు నమ్మి అతని భార్యని అక్కడి కూర్చోపెట్టి ఆధార్ కార్డు జిరాక్స్లు తీసుకురావడానికి వెళ్ళినాడు. తన భర్త వెళ్లినాక అల్లెపు కృష్ణ ఐ సి ఐ సి ఐ బ్యాంకు ముందు తీసుకుని వెళ్ళి అక్కడ కూర్చొబెట్టి, అమ్మ నీ ఫోటో తీయాలి కావున నీ ఒంటి మీద బంగారం ఉండకూడదు అని మాయమాటలు చెప్పి తనని మోసగించి తన మెడలో ఉన్న బంగారపు పుస్తెలతాడు గొలుసు తీసుకుని, రేషన్ కార్డు పత్రాల కోసం 40 రూపాయలు ఇచ్చి మళ్ళీ వస్తా అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. బంగారం విలువ అందాద 80,000/ రూ ఉంటుంది. బయటికి వెళ్ళేటప్పుడు ఒంటరి మహిళలు , వృద్ధులు ఇలా పెన్షన్ ఇస్తా అంటే నమ్మకూడదని అలాగే తెలియని వారితో తమ వివరాలను గోప్యంగా ఉంచుకోవాలని అలాగే అనుమానితులు పట్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, వృద్ధాప్య తల్లిదండ్రుల పిల్లలు తల్లిదండ్రుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, నిందితుడైన అల్లెపుకృష్ణ s/o వెంకటయ్య అను అతనిని జమ్మికుంట పోలీసులైనా సీఐ వరగంటి రవి మోహన్ సదయ్య అబ్దుల్ ఖదీర్ శ్రీకాంత్ 36 గంటలలో పట్టుకోవడం జరిగింది .ఇతనిపై జమ్మికుంటలో 3 కేసులు,హుజురాబాద్ లో 3కేసులు, కరీంనగర్లో 10 కేసులు రాష్ట్ర వ్యాప్తంగా 85 కేసులు, ఇతను గతంలో రెండుసార్లు పిడి యాక్ట్ కింద నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించినాడు అని ఏసీపిశ్రీనివాస్ జి తెలియజేసినారుఅల్లెపు కృష్ణ ఏ గ్రామానికి వెళ్ళినా ఆ గ్రామం యొక్క మహిళలతో ఆ గ్రామం యొక్క పంచాయతీ కార్యదర్శి అని చెప్పి వారికి పెన్షన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి వారి దగ్గర నుండి మంగళసూత్రం నల్లపూసల లాంటి బంగారు వస్తువులు ఫోటో కి అడ్డు వస్తాయని చెప్పి మళ్లీ ఇస్తానని తన దగ్గర ఉంచుకొని అక్కడ నుండి వెళ్లిపోతాడు కాబట్టి దయచేసి ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు మీ వద్దకు వచ్చి మీకు పింఛన్ ఇప్పిస్తాను లేదంటే గవర్నమెంట్ సంక్షేమ పథకాలు ఇస్తాను అంటే నమ్మి మీ దగ్గర వస్తువులు ఎవరికి ఇవ్వకూడదు అని తెలిపారు.




## భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు

**శంకర్ పల్లి ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని రామంతపూర్ గ్రామంలో గల బద్దం మాణిక్య రెడ్డి పంక్షన్ హాల్ లో శనివారం భూభారతి చట్టంపై రైతులకు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శంకర్ పల్లి తహశీల్దార్ యం సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి స్థానంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన భూభారతి చట్టంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సీ నారాయణ రెడ్డి ఆదేశించారన్నారు. వారి ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నం 2:30ని లకు మున్సిపల్ పరిధిలో జరిగే ఈ అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ సీ నారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరవుతారని, మున్సిపల్ కేంద్రంతో పాటు, మున్సిపల్ పరిధిలోని, మండల పరిధిలోని అన్నిగ్రామాల రైతులు, ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## వరి ధాన్యం కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు.

**చివ్వేంల,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** శుక్రవారం మండలంలోని వాల్యతండా ఐకెపి వారు,వట్టికంపాడు, కూడా కూడా మెప్మ,ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తనిఖీ చేశారు.ధాన్యం సేకరణ ను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు.ధాన్యం తరలించిన రైతులతో అధనపు కలెక్టర్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరాదీశారు.కాంటా వేసేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం యొక్క తేమశాతాన్ని పరిశీలించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని వెంటనే లారీలలో లోడ్ చేసి వారికి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యత ప్రమాణాలు లోబడి ధాన్యం తీసుకుని వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు టార్పాలెంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ధాన్యం విక్రయించిన రైతులకు వెంటవెంటనే బిల్లులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని,రైస్ మిల్లులో ఎప్పటికప్పుడు ట్రాక్ షీట్స్ తెప్పించుకొని టాబ్లలో ఎంట్రి చేయాలని ఆదేశించారు. రైతుల నుండి ధాన్యం కొన్న వెంటనే వారికి పూర్తి వివరాలుతో కూడిన రసీదు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. అనంతరం కూడా కూడా లోని శ్రీ భవాని రైస్ ఇండస్ట్రీస్ పరిశీలించారు. అక్కడ ఇంకా లోడ్ చేయని వాహనాలను చూసి వెంటనే అన్లోడ్ చేయాలని ఆదేశించారు.హమాలీలను ఎక్కువగా పెట్టుకోవాలని తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని పేర్కొన్నారు. దొడ్డిబియ్యం,సన్న బియ్యం మిల్లులో సపరేట్గా పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ రాజేశ్వరరావు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక హోదా కోసం కూటమి ప్రభుత్వం గట్టిగా కృషి చెయ్యాలి.

**పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు.**



**విశాఖపట్నం,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ముగిసిన అద్యాయమని 16 వ ఆర్థిక సంఘం చైర్మన్ చెప్పడం విచారకరమని పిసిసి ప్రధాన కార్యదర్శి ఓ బి సి డిపార్ట్మెంట్ ఇన్చార్జ్ మూల వెంకట్రావు ఆవేదన వెలిబుచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇస్తామని స్వయంగా ప్రదానమంత్రి వాగ్దానం చేశారని,దీనికోసం రాష్ట్ర ప్రజలు గత పది సంవత్సరాలుగా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని,కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆశలను వమ్ము చేయిదని నమ్ము తున్నట్లు పేర్కొన్నారు.14వ ఆర్థిక సంఘం చైర్మన్ ఇది తమ పరిధి లోకి రాదని చెప్పగా, 16వ కమిషన్ చైర్మన్ ముగిసిన అద్యాయం అని చెప్పడం విచారకరమన్నారు. ప్రణాళికా సంఘం దద్దయినంత మాత్రాన ప్రభుత్వ విధానం మారదని, ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశము,నీతి అయోగతో నిమిత్తం లేకుండా 16వ ఆర్థిక సంఘం,రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని ప్రత్యేక హోదా కోసం సిఫారసు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టు బడులకోసం విదేశీ కంపెనీల చుట్టూ తిరిగి నిరాశ పడే కన్నా,వీరు పెట్టే అలవిమాలిన నిబంధనలకు లొంగి మనవనరులు అప్పనంగా అప్పగించడం మాని ప్రత్యేక హోదా కోసం గట్టిగా ప్రయత్నిస్తే పెట్టుబడులు వాటంతటఅవే వస్తాయని మూల వెంకటరావు స్పష్టం చేశారు. హోదాతో లభించే అవకాశాలను బట్టి పెట్టుబడిదారులు మనచుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. అందువలన రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక హోదా ప్రాముఖ్యతను గుర్తించాలని,గత పది సంవత్సరాల అనుభవం దీన్ని రుజువు చేసిందని వెల్లడించారు.ప్రత్యేక హోదా లేని రాష్ట్రానికి నిధులు పరిశ్రమలు పెద్దగా రాకపోవడంతో అప్పులతో కాలాన్ని వెళ్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, దీనివలన రాష్ట్రం అన్ని విధాల వెనుకబడిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు.రాష్ట్రంలో సంపన్నులు ఎవరూ కూడా పెట్టుబడి పెట్టడానికి సిద్ధ పడడం లేదని, ఇతర దేశాలకు,రాష్ట్రాలకు వెళ్ళి పోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి దనవంతులు పెట్టుబడులు పెట్టేలా కృషి చేయ్యాలని కోరారు.అలాగే ప్రత్యేక హోదా,విభజన హామిల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి తీసుకురావాలని,ముఖ్యంగా ప్రధాన మంత్రికి ఈ విషయాన్ని వివరించి చెబితే తప్పకుండా హామీ ఇస్తారని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు మూల వెంకటరావు ప్రకటించారు.

## మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**చౌటుప్పల్,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):** పి.ఎ.సి.ఎస్ చౌటుప్పల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి తాళ్ల సింగారం,గుండ్ల బావి, అంకిరెడ్డిగూడెం,పంతంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నల్గొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.డిసిసిబి చైర్మన్ మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలిపారు.సన్నారకం ధాన్యానికి మద్దతు ధర రూపాయలు 2320,బోనస్ 500 రూపాయలు ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలియజేశారు.అనంతరం సంఘ అధ్యక్షులు చింతల దామోదర్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ ని శాలువా,బొకేతో ఘనంగా సన్మానించారు.చౌటుప్పల్ మండలంలో నూతనంగా ఎస్.లింగోటం గ్రామంలో ఒక సొసైటీ ఏర్పాటు చేయనున్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంభ శ్రీనివాసరెడ్డి తెలిపారు,దీనికి గాను సంఘ అధ్యక్షులు మరియు పాలకవర్గం డీసీసీబీ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ యొక్క కార్యక్రమంలో ఎమ్మార్వో హరిక్రిష్ణ,కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ కే.సురేష్,మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు ,మాజీ జెడ్పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి ,మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి ,వైస్ చైర్మన్ చెన్నగొని అంజయ్య గౌడ్, ఏఎంసి వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి ,డైరెక్టర్లు భాతరాజు సాయిలు, సప్పిడి వెంకట్ రెడ్డి,మాజీ పిఎసిఎస్ చైర్మన్ చీర్క సంజీవరెడ్డి,మాజీ సర్పంచులు బాతరాజు సత్యం,ముద్దం సుమిత్ర సత్తయ్య గౌడ్,సుర్వి మల్లేష్ గౌడ్ ,పబ్బు రాజు గౌడ్, బోయ దేవేందర్,గిరకంటి నిరంజన్ గౌడ్ ,దూడల బిక్షం గౌడ్,షాది ఖానా చైర్మన్ కరీం , ఏఎంసి డైరెక్టర్స్ బోయ వెంకట్ ,ఢిల్లీ చంద్రకళ,పబ్బు శ్రీకాంత్, మరియు ఢిల్లీ మాధవరెడ్డి ,అర్థ వెంకట్ రెడ్డి,కొత్త పర్వతాలు,చిర్క అంజిరెడ్డి,సుర్కంటి రామిరెడ్డి ,జాల మల్లేష్,సుర్వి సత్తయ్య,సుర్కంటి వెంకట రెడ్డి,గుత్త శ్రీధర్ రెడ్డి , పిల్లలమర్రి మధుసూదన్, ఎండి హన్నుభాయ్, యటాశంకరయ్య, ఏఈఓ వెన్నెల ,ఉమామహేశ్వరి, కార్యదర్శి వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసీతారామచంద్ స్వామిబ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీస్అధికారులనుకలిసికృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు

**జమ్మికుంట ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం)**

అపరభద్రాద్రిగాపేరుపొందినఇల్లంతకుంటలోని శ్రీసీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని ఇల్లంతకుంట ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు అన్నారు జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవి రూరల్ సీఐ కోరే కిషోర్ ఇల్లంతకుంట ఎస్ఐ రాజకుమార్ వీణవంక ఎస్ఐ తోట తిరుపతిని ను మర్యాద పూర్వకంగా కలిసి వారికి స్వామి వారి ప్రసాదం మెమొంటోతో కళ్యాణం అక్షింతలు అందించి వారిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు లిపినట్లు రామారావు పేర్కొన్నారుఅనంతరం రామారావు మాట్లాడుతూ 13రోజులపాటుసాగినబ్రహ్మోత్సవాలలో పోలీస్ శాఖ అందించిన సేవలుఅభినందనీయమని వారిని ఈ సందర్భంగా కలుసుకొని చిరు సన్మానం చేయడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోధర్మకర్తలుపరమేశ్వర్,రవికిరణ్,గోపాల్ రెడ్డి ,కిషన్ రెడ్డిచిరంజీవి,రామ్.రెడ్డి,నాగరాజు లావణ్య శ్రీనివాస్ ,నారాయణ రెడ్డి,రాజేందర్, మల్లేష్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.



## దళిత రత్న అవార్డు గ్రహీత బత్తుల పాండు ను సన్మానించిన అంబేద్కర్ యువజన సంఘం దళిత సంఘాల నాయకులు

**జమ్మికుంట ఏప్రిల్ 18( ప్రజాక్షేత్రం)** జమ్మికుంట మండలంలోని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం, దళిత ప్రజా సంఘం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని పలు సామాజిక ఉద్యమాలలోదళిత బహుజన ఉద్యమంలో పాల్గొని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమాలు నడిపించినందుకు అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్ళినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అంబేద్కర్ జయంతి హైదరాబాద్ రవీంద్రభారతిలో బత్తుల పాండు కి దళిత రత్న అవార్డు ప్రభుత్వ అధికారుల చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. దానిని పురస్కరించుకొని జమ్మికుంట మండలంలోని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీత బత్తుల పాండుకి సన్మానం చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న నాయకులుబిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దబ్బెట రవీందర్ టి ఏ వై ఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మైస సాంబయ్య టి ఏ వై ఎస్ ప్రధాన కార్యదర్శి రాచపల్లి వంశీ కుమార్ టి ఏ వై ఎస్ ఉపాధ్యక్షులు పోడేటి వేణు టి ఏ వై ఎస్ ఇంచార్జి రాచపల్లి సాగర్ టి ఏ వై ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పూలల నరేష్ సీనియర్ నాయకులు పాతకాల సంపత్ పంబాల కులవృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెర్ల కమలాకర్ సీనియర్ నాయకులు సుద్దాల వెంకన్న బత్తుల రామకృష్ణ గుంటి రాజు గడ్డం భార్గవ్ బత్తుల రాజేందర్ రౌతు ప్రసన్న కుమార్ రఘు అంబేద్కర్ సంఘం నాయకులుకోలుగురి రవీందర్, మోలుగురి రాజేందర్.శనిగరపు మధుజుకంటి అజేందర్ ఆదర్చంటి శశి తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు:జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**కొండాపూర్,ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం):** అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు వికలాంగులకు ప్రాధాన్యత నిస్తూ పారదర్శకంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మల్కాపూర్ గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరై అర్హులైన ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా జాబితాను సిద్ధం చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ శ్రీనివాస్. పంచాయితీ కార్యదర్శి రఘు. కమిటీ సభ్యులు ఆంజనేయులు,శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






# దారుణం...!

**ఇద్దరు పిల్లలను నరికి చంపి,తల్లి ఆత్మహత్య..**

**మేడ్చల్,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**మేడ్చల్ జిల్లా ,గాజులరామారంలో ఓ తల్లి ఇద్దరు పిల్లలను నరికి చంపి ఆపై తానూ ఆత్మహత్య చేసుకుంది.ఇద్దరు పిల్లలను వేట కొడవలితో మట్టుపెట్టిన కన్న తల్లి.. ఆపై ఆరంతస్తుల భవనంపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది.అయితే గురువారం జరిగిన ఈ దారుణ ఘటనపై కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పిల్లలు ఆశిష్ (7),హర్షిత్ (4)కి శ్వాసకోశ సమస్యలు ఉండటంతో ప్రతి 3,4 గంటలకు ఒకసారి డ్రాప్స్ వేయాలి.దీంతో తేజస్విని తనలోతాను మానసికంగా కుంగిపోయినట్లు సమాచారం. 'మెరుగైన వైద్యానికి భర్త సహకరించట్లేదు. ఎంత ఆస్తి ఉన్నా పిల్లలకు పనికిరాకుండా పోతోంది. ఏమైనా మాట్లాడితే భర్త కోపంతో కసురుకుంటాడు. నా పరిస్థితి పిల్లల పరిస్థితి మరి దారుణంగా తయారైంది.' అని సూసైడ్ నోట్ రాసింది.

# కుళ్లిన చికెన్, ఫ్రిజ్ లో మూలుగుతున్న మటన్.. ఇది ఈ హోటళ్ల తీరు

**శంషాబాద్ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**

హోటల్ లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని శంషాబాద్ మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య హెచ్చరించారు. శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు ఆదేశాలతో శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య, అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కిన్నెర గ్రాండ్ హోటల్, నెల్లూరి వారి వెంగమాంబ మిస్ హోటల్లో ఉన్న ఫ్రిడ్జ్ లో నిలవ ఉన్న గడ్డకట్టిన మాంసం, చికెన్ లను గుర్తించారు. కిచెన్ లో అపరిశుభ్రత నిర్లక్ష్యం, పరిశుభ్రతను గాలికి వదిలేసినట్లు నిర్ధారించి నెల్లూరు వారి వెంగమాంబ మిస్ హోటల్‌కు 20 వేల జరిమానా, కెనరా గ్రాండ్ హోటల్‌కు 10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హోటల్ నిర్వాహణలో పరిశుభ్రత పాటించకుండా అపరిశుభ్రంగా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కిచెన్ లో పరిశుభ్రత పాటిస్తూ కూరగాయలు చికెన్ మటన్ లో ఎప్పటికప్పుడు తెచ్చుకొని వంటకాలు నిర్వహించాలని మిగిలిన వాటిని పారబోయాలని తెలిపారు. నిబంధనలు పాటించకుండా చికెన్ మటన్ ను ఫ్రిజ్ లో పెట్టి నిల్వ ఉంచి వంటకాలు చేస్తే హోటల్ పై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జరిమానా విధించిన హోటల్లో మరోసారి నిర్లక్ష్యం బయటపడితే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. హోటళ్లలో అపరిశుభ్రత కనిపిస్తే వినియోగదారులు శంషాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.



# ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందుకునే విధంగా మాదిగ విద్యార్థి, నిరుద్యోగులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి.



**మంద కృష్ణ మాదిగ పిలుపు**



**హన్మకొండ ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**ఎస్సీ వర్గీకరణ సాధించిన సందర్భంగా.... అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ పొందిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ కి పుల్ల ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఉమా మహేశ్వర గార్డెన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి డా. పుల్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ లాంగుల పెన్షన్ల ఉద్యమం, తెలంగాణ అమరుల కుటుంబాల ఉద్యమం, ఆకలికేకల ఉద్యమం, మహిళా ఉద్యమం చేపట్టి అన్ని వర్గాల ప్రజలకు పథకాలను అందించడం జరిగిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన నేపథ్యంలో అన్ని కులాలకు సామాజిక న్యాయం సాధించడానికి, దేశ సంపద పంపిణీ అందరికీ పంపిణీ కావడానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల పరిరక్షణ కోసం, సామాజిక సమానత్వం కోసం, ఆర్థిక న్యాయం అందరికీ అందించడం కోసం, భూముల పంపిణీ కోసం అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమ ప్రయాణం ముందుకు సాగవల్సిన అవసరం ఉందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించడాని పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని , నిరంతరం పర్యవేక్షిస్తూ చదువుల్లో ఉద్యోగాల్లో ముందుకు సాగేలా ప్రోత్సహించాలని అన్నారు. పుల్ల ఫ్యామిలీస్ లో ఉన్నత చదువులు చదివిన వారు, ఉద్యోగాల్లో వ్యాపారాల్లో స్థిరపడిన వారు జాతిని సమగ్రంగా అభివృద్ధి వైపు నడిపించడానికి జరుగుతున్న ప్రయత్నంలో బాధ్యత తీసుకోవాలని అన్నారు. జాతి పట్ల, సమాజం పట్ల పుల్ల ఫ్యామిలీస్ నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలను అభినందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు, కళానేతలు, ఉద్యోగాలు పుల్ల ఫ్యామిలీస్ ప్రముఖులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వ్యక్తి మృతి

**తూప్రాన్, ఏప్రిల్ 18, (ప్రజాక్షేత్రం),** అనారోగ్యంలో బాధపడుతూ రోడ్డుపై వెళ్తున్న వ్యక్తి కింద పడి మృతి చెందిన సంఘటన తూప్రాన్ మున్సిపల్ పరిధి వెంకటాపూర్ శివారులో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం జంగంపల్లి కి చెందిన సింధు రమేష్ కు ఆరు సంవత్సరాల క్రితం శివంపేట మండలం గుండ్లపల్లికి చెందిన అభినయతో పెళ్లి జరిగింది. అప్పటి నుండి భార్య సొంత ఊరికి ఇల్లరికం వచ్చి ఉంటున్నాడు.కొన్ని నెలలుగా ఆయన అనారోగ్యం కారణంగా అతని స్వంత ఉరికి వెళ్ళి ఉంటున్నాడు. అప్పడప్పుడు గుండ్లపల్లికి వచ్చి వెళ్తుంటారు. శుక్రవారం వెంకటాపూర్ గ్రామ శివారులో మెయిన్ రోడ్డు పక్కన రమేష్ పడిపోయి ఉండడంతో అతని స్థానికులు హాస్పిటల్ కి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య అభినయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఏటిఎం దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్. ఇద్దరు ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు.

**వివరాలు వెల్లడించిన పెద్దపల్లి డీసీపీ కరుణాకర్.**

**పెద్దపల్లి బ్యూరో,ఏప్రిల్ 18(ప్రజాక్షేత్రం):**పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎస్బిఐ ఎటిఎం వద్ద ఖాతాదారులు విత్ డ్రా చేసుకున్న సొమ్మును చాకచక్యంగా చోరీ చేస్తున్న రాజస్థాన్ కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పెద్దపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.జల్సాల కోసం సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములైన సాదిక్,ఆరిఫ్ లు రాజస్థాన్ రాష్ట్రం నుండి బలేనో కారులో రాజస్థాన్,మధ్యప్రదేశ్,మహారాష్ట్ర ల మీదుగా తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశించి పెట్రో కంపెనీకి చెందిన ఏటీఎంలను గుర్తించి వాటిలో దొంగతనాలకు పాల్పడ్డారని డీసీపీ కరుణాకర్ వివరించారు.ఏటీఎం రూముల వద్ద జనసంచారం లేని సమయంలో రూమ్ లోకి వెళ్లి టీ ఆకారంలో ఉన్న కీతో ఏటీఎం మిషన్ ఫ్రంట్ డోర్ ఓపెన్ చేసి డబ్బులు వచ్చే మార్గంలో క్యాష్ డిస్పెన్సర్కు రేకుముక్క అడ్డంగా ఉండేటట్లు ప్లాస్టర్ వేసి మళ్లీ యధావిధిగా డోర్ క్లోజ్ చేసి బయటకు వెళ్లి వినియోగదారులు ఏటీఎం కి వచ్చి డబ్బులు డ్రా చేసే సమయంలో డబ్బులు బయటకు రాకుండా ఏర్పాటు చేసి అవి ఒక బాక్స్ లో పడేవిధంగా చేసి ఆ డబ్బులు దొంగిలించే వారని పేర్కొన్నారు.దొంగతనానికి పాల్పడుతున్న ముఠా సభ్యుల సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించి ఏటీఎంలో దొంగతనం చేసిన విధానాన్ని పరిశీలించి నిందితులను గుర్తించామని డిసిపి తెలిపారు.నేరస్తులైన రాజస్థాన్కు చెందిన ముఠా సభ్యులు తమ సొంత గ్రామానికి పారిపోతుండగా పెద్దపల్లి రైల్వే స్టేషన్ దగ్గర మాటు వేసి పట్టుకున్నామని పేర్కొన్నారు.దొంగతనాలకు ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకొని ఇద్దరు ముఠా సభ్యులను రిమాండ్ కు తరలించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ,సిఐ ప్రవీణ్ కుమార్,ఎస్సై లక్ష్మణరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.





# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మెదక్ ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం)**కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ మండలం రాజ్ పల్లి గ్రామం లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మైనంపల్లి రోహిత్ రావు సంబంధిత ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రాల వసతుల పై ఆరా తీశారు. వరి కాకుండా ఇతర పంటలు సాగు చేస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కాంటాలు, తేమ యంత్రాలు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు ఉన్నాయా లేవా అని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆరా తీశారు. అనంతరం శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

# చింతలపూడి పట్టణంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా లస్సి ప్యాకెట్లు పంపిణీ చేసిన ముస్లిం సోదరులు



**ఏలూరు జిల్లా,ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం):**చింతలపూడి పట్టణంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా చింతలపూడి మండలంలోని చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రార్థన చేశారు. అనంతరం బోయగూడెం మరియు మండలం లోని క్రైస్తవ సోదరులు ర్యాలీగా పాల్గొన్నారు.చింతలపూడి పట్టణంలో గురుభట్ల గూడెం రోడ్డులోజమాత్ ఇస్లాం హింద్ మరియు ఐ వై హెచ్ ముస్లీమ్ సోదరులు లస్సి ప్యాకెట్లను పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో చింతలపూడి సి ఐ రాజశేఖర్,క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ సభను విజయవంతం చేయాలి

**తూప్రాన్, ఏప్రిల్ 18, (ప్రజాక్షేత్రం)** వరంగల్ లో జరిగే బి ఆర్ ఎస్ రజతోత్సవ సభకు నాయకులు,కార్యకర్తలు అధికంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని గజ్వేల్ బి ఆర్ ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ జిల్లా తూప్రాన్ తో పాటు మండలంలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన బి ఆర్ ఎస్ పార్టీ మండల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ కాన్స్టెన్సీ లోని ప్రతి ఊరు నుండి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు వరంగల్ సభను భారీ ఎత్తున విజయవంతం చేయాలన్నారు. గజ్వేల్ కాన్స్టెన్సీ నుండి భారీ ఎత్తున తరలిరావాలని గులాబీ పిలుపునిచ్చారు వరంగల్లో జరిగే రజతోత్సవ సభ తెలంగాణ రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుండెల్లో రైళ్లు పరిగెత్తే విధంగా వరంగల్ సభ ఉంటుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో అబద్ధపు పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల కాలంలో హామీలను తుంగలో తొక్కిందనీ, 6 గ్యారంటీలను విస్మరించిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వడం లేదన్నారు. పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. మహిళలకు 2500 రూపాయలు ఇవ్వడం లేదన్నారు. చదువుకున్న విద్యార్థులకు బైక్ లను పంపిణీ లేదన్నారు, రైతు భరోసాను ఎగ్గొట్టారన్నారు, రైతు రుణమాఫీ పూర్తి చేయలేదన్నారు, రైతు బీమా ఊసే లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ ఫలాలు కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రమే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అమలు కానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు పెద్ద సంఖ్యలో వరంగల్లో నిర్వహించే సభకు తరలి రావాలని సూచించారు. ఈ సమావేశంలో తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, మండల ప్రెసిడెంట్ బాబుల్ రెడ్డి, జిల్లా నాయకులు సత్యనారాయణ గౌడ్, లంబ రమేష్, కృష్ణారెడ్డి,నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.




# ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు...

**మెదక్ ఏప్రిల్ 18 (ప్రజాక్షేత్రం)**వందేళ్ల చరిత్ర గల మెదక్ సీఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు శిలువ ను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థన మందిరం ప్రతిష్టించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ బిషప్ కనక ప్రసాద్ మాట్లాడుతూ యేసు మరణించే ముందు చెప్పిన ఏడు వాక్యాలను మననం చేసుకునే రోజే శుభ శుక్రవారం అన్నారు. ప్రజలందరికీ లోక రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువు యొక్క ఆశీర్వాదాలు ఉండాలని, ఏసుక్రీస్తు ఆశీర్వాదాలతో లోకంలోని సకల మానవాళికి శుభములు కలగాలని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి యేసుప్రభుని దర్శించుకున్నారు. భక్త బృందం క్రీస్తును స్తుతిస్తూ పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్ బీటర్ ఇంచార్జ్ శాంతయ్య, గురువులు రిచర్డ్, జైపాల్, శ్రీనివాస్, చర్చ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు









# విడాకుల బాటలో మరో స్టార్ కపుల్..?

సహజంగా సినిమా రంగంలోని స్టార్ హీరోయిన్ల నుండి 'డిప్రెషన్, పర్సనల్ ప్రాబ్లమ్, మనసు బాగోలేదు'.. వంటి మాటలు వచ్చినప్పుడు అందరికీ వారి వైవాహిక జీవితం మీదకే దృష్టి పోతుంది. నజ్రియా తాజా లేఖను చదివిన వారిలో అత్యధిక శాతం మంది ఆమెకు, ఫహద్ కు మధ్య గొడవలు వచ్చాయని, వీరిద్దరూ విడిపోబోతున్నారని రకరకాలుగా వ్యాఖ్యానించడం మొదలు పెట్టారు. వీటిల్లో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది. నజ్రియా క్షమాపణల లేఖతో సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చకు ఫుల్ స్టాప్ పెట్టాల్సిన బాధ్యత, ఆమె మీద, ఆమె భర్త ఫహద్ మీద ఉంది. నజ్రియా లెటర్ హెడ్ లోని పేరు చివర ఫహద్ పేరు ఉండటం వల్ల ఆమెకు, అతనికి మధ్య ఎలాంటి గొడవలూ లేవని, ఆమె ఎదుర్కొంటున్న సమస్య కేవలం వ్యక్తిగతమైనదని కొందరు అంటున్నారు. ఏదేమైనా... ఇటీవల సినిమా జంటలు కొన్ని విడిపోయిన నేపథ్యంలో ఫహద్, నజ్రియా జోడీ కూడా ఆ జాబితాలో చేరుతుందేమోననే ఆందోళనకు వారి అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. పైగా నజ్రియా పెట్టిన పోస్ట్ కు సమంత లైక్ కొట్టడంతో సమంత బాటలోనే నజ్రియా కూడా నడవబోతోందా? అని సందేహపడుతున్నారు. మరి ఈ విషయంలో ఎటువైపు నుండి ఎవరు వివరణ ఇస్తారో చూడాలి.

# సమంత 'సిటడెల్'.. సీజన్2 రద్దు చేసిన అమెజాన్ కారణమిదే

వరుణ్ ధావన్, సమంత జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లింగ్ వెబ్‌సిరీస్ 'సిటడెల్: హనీబన్నీ' ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ నటించిన వెబ్ సిరీస్‌కి ఇండియన్ వెర్షన్‌గా ఇది రూపొందిన విషయం తెలిసిందే. దీని పార్ట్ 2 కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ అభిమానులకు బ్యాడ్ న్యూస్ చెప్పింది. దీని సీజన్2ను రద్దు చేస్తున్నట్లు తెలిపింది.ప్రియాంక నటించిన సిటడెల్ ఆధారంగానే ఇండియన్ వెర్షన్, ఇటాలియన్ వెర్షన్‌లు రూపొందాయి. తాజాగా ఈ రెండింటి కొనసాగింపులను రద్దు చేశారు. బదులుగా వీటిని మాతృకలో విలీ చేయనున్నారు. ఈవిషయంపై అమెజాన్ ప్రతినిధులు స్పష్టత నిచ్చారు. "సిటడెల్: హనీబన్నీ, సిటడెల్: డయానా తదుపరి సీజన్లను నిలిపివేసి.. వా నసాగింపు కథలను మాతృకలో విలీనం చేస్తున్నాం. ఈ సిరీస్ అన్ని భాషల్లోనే అద్భుతమైన విజయం సొంతం చేసుకుంది. ఇది ఓ భావోద్వేగ ప్రయాణం. మాతృకను మరింత గొప్పగా తెరకెక్కించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం" తెలిపారు. ఇక ప్రియాంక నటిస్తోన్న 'సిటడెల్ పార్ట్2' 2026లో విడుదల కాన ట్లు చెప్పారు.





# 'అన్నన పాథియే' వెనుక కథ ఇది..!

'అన్నన పాథియే'.. ఈ మధ్యకా లంలో సోషల్‌మీడియా ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యంత ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న పాట ఇది. సుమారు 1.02 నిమిషాల ఉన్న ఈ పాటకు అర్థం తెలియకపోయినా.. రిథమ్ బాగుండటంతో నెటిజన్లు, సెలబ్రిటీలు దీనికి వరుస పెట్టి రీల్స్ చేస్తున్నారు. 'అన్నన పాథియే' అనేది ఒక థాయ్ పదం. థాయ్ ప్రజలు ఒక వ్యక్తిపై ప్రేమను వ్యక్తం చేయడానికి ఈ పదాలను ఉపయోగిస్తూ పాటలు పాడుతుంటారు. 'అన్నన పాథియే' అనే పదబంధాన్ని తొలిసారి 'టోంగ్ బావో క్రాహ్మోమ్' అనే ఆల్బమ్ కోసం ఉపయోగించారు. సాక్ పక్నం అనే థాయ్ గాయకుడు ఈ లిరిక్స్‌ను తనదైన స్టైల్‌లో ఆలపించారు. ఒక వ్యక్తి తన ప్రేమను ప్రియురాలికి తెలియజేసే క్రమంలో కాస్త హాస్యం జోడించి సరదాగా దీనిని పాడారు. ఆ విధంగా ఈ పాట విశేషంగా వాడుకలోకి వచ్చింది



# రామారావుగారు నాతో చెప్పిన మాట అదొక్కటే: నటి లక్ష్మి

లక్ష్మి .. వివిధ భాషల్లో స్టార్ డమ్ ను సంపాదించుకున్న ఆమె, తెలుగులో ఎన్టీఆర్ .. ఏఎన్నార్ .. శోభన్ బాబు వంటి కథానాయకులతో కలిసి నటించారు. ఆమె వాయిస్ .. డైలాగ్ డెలివరీ ప్రత్యేకమైన ఆకర్షణగా కనిపిస్తాయి. అలాంటి లక్ష్మి తాజాగా ఓ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, రామారావుతో తనకి గల అనుబంధాన్ని గురించి ప్రస్తావించారు. ఎన్టీ రామారావు పౌరాణిక సినిమాలను చూస్తూ పెరిగిన తనకు, ఆయనతో కలిసి నటించే ఛాన్స్ వచ్చిందన్నారు. ఆయనతో ఫస్టు సినిమా చేసే సమయానికి తన వయసు చాలా చిన్నదన్నారు. అందరినీ సమానంగా చూసే ఆయన స్వభావం నన్ను ఆలోచింపజేసింది. సెట్లో ప్రతి విషయంపై ఆయన పూర్తి ఫోకస్ పెట్టేవారు. ఏ విషయాన్ని సరదాగా .. నవ్వులాటగా తీసుకునేవారు కాదు. బాగా తినాలి .. ఉదయం 4 గంటలకే లేవాలి ..వ్యాయామం చేయాలి అని చెప్పేవారు" అని అన్నారు. ఒక సందర్భంలో ఆయన మాట్లాడుతూ 'ఒక కాలుపోయినా ఇంకొక కాలు ఉందిగదా అనుకోవాలి లక్ష్మిగారూ. ప్రతి విషయాన్నీ పాజిటివ్ గా తీసుకోవాలి .. కొల్పోయిన వాటిని గురించి ఆలోచిస్తూ ఉంటే అక్కడే కుప్పకూలిపోతాం. కాలం మన చేతిలో ఉంది .. అది మన చేతిలో ఉన్నంతవరకూ మనం ఏమీ కోల్పోనట్టే" అన్నారు. ఆ ఒక్క మాట తనను ఇంత వరకూ నడిపించింది అని చెప్పడానికి గర్వపడుతున్నాట్లు చెప్పారు.



# రిలేషన్ షిప్స్ చెడిపోరాదంటున్న రశ్మిక

## అందుకేనా ప్రేమయాత్రలు అంటూ నెటిజన్స్ కామెంట్స్

అందాలభామ రష్మికా మందన్న పేరు వినగానే చప్పున తెలుగువారికి విజయ్ దేవరకొండ కూడా గుర్తుకు వస్తుంటారు. ఎందుకంటే వారిద్దరూ ప్రేమపక్షుల్లా ఎక్కడికో ఎగిరిపోతుంటారు. మళ్ళీ ఎవరి గూట్లో వాళ్ళు చేరుతుంటారు. అందువల్ల వీరిద్దరికి సంబంధించిన ఏ అంశం వెలుగు చూసినా, మరొకరు కూడా ఉన్నారా లేదా అంటూ ఆరా తీస్తుంటారు జనం. ఇంతకూ అసలు విషయమేమిటంటే "కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుంటే ఎన్నటికీ చేయి విడవకుంటే రిలేషన్ షిప్స్ చెడిపోవు." అనే సారాంశంతో ఓ పోస్ట్ ను రశ్మిక రీ పోస్ట్ చేసింది. దీంతో నేనూ ఏకీభవిస్తాను అంటూ చాటింపేసింది. దాంతో పలు రకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఒకప్పటి రిలేషన్ షిప్ ఏమైందమ్మా అంటూ కొందరు వెక్కిరిస్తున్నారు. అయితే ఇప్పుడు మాత్రం తాను ఎంత టాప్ పొజిషన్ కు చేరుకున్నా విజయ్ దేవరకొండతోనే ప్రేమాయణం సాగించడాన్ని అందరూ అభినందిస్తున్నారు. మరి బంధాలుఅనుబంధాలకు ఎంతో ప్రాధాన్యమిస్తున్న రశ్మిక ఎప్పుడు పెళ్ళికూతురవుతుందో చూడాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNER BY K PRAVEEN KUMAR, PRINTED AT M R PUBLICATIONS, #631880, VANASTHALIPURAM, RANGA REDDY (DIST), HYDERABAD, TELANGANA 500070. PUBLISHED AT H.NO. 250 SHANKAR PALLY, RANGA REDDY, HYDERABAD, TELANGANA 501203. EDITOR : K PRAVEEN KUMAR. PHONE NUMBER 9177920459, EMAIL ID : PRAJAKSHETRAM1@GMAIL.COM, HTTPS://PRAJAKSHETRAM.IN, RNI NO. TELTEL/12330